www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 151 | శనివారం 18.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-



## హర్యానాలో చారిత్రక ఘట్టం..

### డీజిల్, విద్యుత్ వినియోగం తగ్గిస్తాం..

**భవిష్యత్ రవాణా వ్యవస్థకు హైడ్రోజన్‌దే**

**గ్రీన్ మొబిలిటీలో ప్రపంచ దేశాల సరసన భారత్**

- పర్యావరణహిత రవాణాకు భారత్ కట్టుబడి ఉంది
- ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రోజన్ రైలు మనదే
- 10 కోచ్‌లతో ప్రపంచానికి భారత్ ఆదర్శం
- హైడ్రోజన్ రైలు హర్యానాకు చిరస్మరణీయం
- ఏ సంక్షోభమైనా భారత్ సిద్ధంగా ఉంటుంది
- ఇంధన సంక్షోభాలకు హైడ్రోజన్‌నే పరిష్కారం
- రైల్వే విద్యుదీకరణ 99 శాతానికి చేరింది
- అభివృద్ధి దిశగా భారత్ అడుగులు ఆగవు
- హైడ్రోజన్ టెక్నాలజీలో భారత్ కొత్త చరిత్ర
- పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

02

పర్యావరణహిత ప్రాధాన్యంలో భాగంగానే హైడ్రోజన్ రైలు తీసుకువచ్చామన్నారు. జర్మనీ, చైనా, జపాన్, అమెరికా దేశాల తర్వాత భారత్‌లోనే హైడ్రోజన్ రైలు ఉందని చెప్పారు. ప్రపంచంలోనే అతి పెద్ద హైడ్రోజన్ రైలు ఇదని, ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైళ్లలో 2-4 కోచ్‌లు మాత్రమే ఉంటాయని కానీ సింద్-సోనిపట్ రైల్లో 10 కోచ్ లు ఉన్నాయన్నారు.

## నర్సింగ్..దైవత్వం

## కూడిన ఉన్నతమైన వృత్తి



**247 మంది నర్సింగ్ అధికారులకు నియామక పత్రాలు**

- నర్సింగ్ ఉద్యోగం కాదు.. సేవా వృత్తి
- ప్రజా వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట
- ఈఎస్ఐ ఆసుపత్రుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- వైద్య సేవల బలోపేతానికి భారీ నియామకాలు
- త్వరలో మరిన్ని వైద్య సిబ్బంది నియామకాలు
- 120 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ల నియామకం త్వరలో
- డయాలసిస్, సీటీ స్కాన్, బర్న్స్ యూనిట్ల ఏర్పాటు
- ఆరోగ్యం, విద్యే ప్రభుత్వ ప్రధాన పెట్టుబడి

05




**ఉద్యోగులంతా మన బిడ్డలే..**

# ధరణిపై దర్యాప్తునకు సిట్

## ట్రెజరీ విధానానికి కేబినెట్ గుడ్‌బై

**బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పులకు ఆమోదం**

**త్వరలో పంచాయతీరాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్**

**ప్రజా సంక్షేమంపై దృష్టి సారించిన మంత్రివర్గం**

- గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వయం ప్రతిపత్తి
- పంచాయతీ నిధులు ఇక నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి
- రాష్ట్రాభివృద్ధికి కీలక నిర్ణయాలకు కేబినెట్ ముద్ర
- పలు శాఖలకు ఊరట కలిగించిన మంత్రివర్గ నిర్ణయాలు
- సంక్షేమం, అభివృద్ధిపై కీలక నిర్ణయాలు
- ధరణి పోర్టల్‌పై ఫోరెన్సిక్ ఆడిట్‌కు గ్రీన్ సిగ్నల్
- భూ అక్రమాలపై సమగ్ర విచారణకు సిద్ధమైన ప్రభుత్వం
- విద్యాశాఖలో పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం
- సంగారెడ్డిలో భూ కేటాయింపులకు గ్రీన్ సిగ్నల్
- పాలమూరు ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఓకే
- పటాన్‌చెరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు గ్రీన్ సిగ్నల్

03

**ప్రజా పాలనకు కొత్త దిశగా కేబినెట్ అడుగులు**

**పాలమూరు ప్రాజెక్టుకు పెరిగిన వ్యయానికి ఓకే**

**సంగారెడ్డిలో భూ కేటాయింపులకు కేబినెట్ పచ్చజెండా**



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ధి చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అలాగే ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు.

**పౌరసత్వాన్ని నిర్ణయించే**

# అధికారం ఈసీకి లేదు..

**జూలై 25కు కేసు విచారణ వాయిదా**

- ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగిస్తే సంక్షేమ పథకాలు ఆపవచ్చా?
- సుప్రీంకోర్టు కీలక విచారణకు అంగీకారం
- ఈసీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి నోటీసులు
- రేషన్, పింఛన్లు నిలిపివేయొద్దని పిటిషన్
- 34 లక్షల అప్పీలు పెండింగ్‌లో ఉన్నాయన్న పిటిషనర్
- 19 ట్రిబ్యునళ్లతో కేసుల పరిష్కారం నెమ్మదిగా
- పారదర్శకత కోసం ట్రిబ్యునళ్లకు వెబ్‌సైట్లు కావాలి
- పాస్‌పోర్ట్ ఉంటే పౌరసత్వానికి అదే ఆధారమని వాదన
- పౌరసత్వం నిర్ణయించే అధికారం ఈసీకి లేదన్న సుప్రీంకోర్టు
- పౌరసత్వ వివాదం తేలే వరకు సంక్షేమ పథకాలు కొనసాగించాలని విజ్ఞప్తి
- ఆర్టికల్ 142 కింద జోక్యం చేసుకోవాలని కోర్టును కోరిన పిటిషనర్

**ఓటు హక్కు వేరు.. సంక్షేమ హక్కు వేరా?**

02

**ఎన్నికల సంఘానికి పౌరసత్వాన్ని తేల్చే అధికారం లేదు..**



# నిధులు మళ్లిస్తే ఊరుకునేది లేదు



**నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి**

- కేంద్ర నిధులతోనే తెలంగాణ అభివృద్ధి
- 15వ ఆర్థిక సంఘం నిధుల మళ్లింపుపై బండి ఆగ్రహం
- గ్రామాల నిధులు కరెంట్ బిల్లులకు వాడటం దుర్మార్గం
- అమృత్-2 కింద కార్గిల్ చెరువు అభివృద్ధికి శ్రీకారం
- నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి
- నాణ్యత లేని పనులు చేస్తే చర్యలు తప్పవు
- కాంట్రాక్టర్ల సిండికేట్‌ను ఉపేక్షించం
- తెలంగాణకు వేల కోట్ల కేంద్ర నిధులు
- 12 ఏళ్లలో తెలంగాణకు రూ.13 లక్షల కోట్లు

03




## డిజిటలైజేషన్ 60 శాతం పూర్తి

- గ్రామాల్లో 80%, పట్టణాల్లో 50%ఎస్ఐఆర్ పూర్తి
- తెలంగాణలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి
- ఎస్ఐఆర్ శిబిరాలను పరిశీలించిన సీఈవో సుదర్శన్ రెడ్డి
- సర్ ప్రక్రియ వేగవంతం చేయాలని బీఎల్వోలకు సూచనలు

03

# ఫిఫా వరల్డ్ కప్ జోష్

**ఫుట్‌బాల్ ఫీవర్‌కు తగ్గట్టే బార్ల టైమింగ్స్**

- ఫిఫా ఫైనల్స్ వేళ తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్
- ఫుట్‌బాల్ అభిమానుల కోసం మద్యం అమ్మకాల సమయం పొడిగింపు
- తెల్లవారుజాము వరకు బార్లకు ప్రత్యేక అనుమతి
- ఫిఫా మ్యాచ్‌ల కోసం ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ఉత్తర్వులు
- వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా బార్లకు అదనపు సమయం
- జులై 19, 20 వరకు ప్రత్యేక మద్యం విక్రయాలకు గ్రీన్ సిగ్నల్
- బార్ యజమానుల విజ్ఞప్తికి సర్కార్ సానుకూల నిర్ణయం

02



# ప్రాజెక్టుల అంచనాలు భారీగా పెంచుతూ ప్రపోజల్స్

హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : పెండింగ్‌లో ఉన్న ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించగా.. వాటిని పూర్తిచేసేందుకు అంచనాలను భారీగా పెంచుతూ రాష్ట్ర నీటి పారుదల శాఖ జాబితాను రూపొందించింది. భారీ స్థాయిలో అంచనాలను పెంచుతూ ప్రభుత్వానికి నివేదికను పంపించినట్టు తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆమోదించిన వ్యయ అంచనాలతో పోలిస్తే దాదాపు రూ. 1,26,960 కోట్ల మేర అదనపు వ్యయాన్ని ప్రతిపాదిస్తూ నీటిపారుదల శాఖ సమగ్ర నివేదికను సిద్ధం చేసిందని తెలుస్తోంది. ప్రస్తుతం నీటిపారుదల శాఖ రూపొందించిన జాబితా ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమోదించిన రూ. 1,64,168 కోట్ల ప్రాజెక్టు వ్యయాన్ని రూ. 2,91,128 కోట్లకు పెంచాలని ప్రతిపాదించింది. అంటే మొత్తం వ్యయం దాదాపు 77 శాతం మేర పెరిగినట్టుగా తెలుస్తోంది. మొత్తంగా చూస్తే గతం కంటే రూ. 1,26,960 కోట్లను అదనంగా పెంచుతూ అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి అందజేసినట్టు సమాచారం. మొత్తం 29 ప్రాజెక్టులకు సంబంధించి ఈ సవరించిన అంచనాలను రూపొందించినట్టు తెలిసింది.

**నాలుగు ప్రాజెక్టులకే రూ.35 వేల కోట్లు పెంపు..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నీటిపారుదల ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష చేపట్టింది. వివిధ ప్రాజెక్టుల పురోగతి, భూసేకరణ, పర్యావరణ అనుమతులు, కోర్టు కేసులు, ధరల పెరుగుదల, డిజైన్ మార్పులు, పెరిగిన నిర్మాణ వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తాజా అంచనాలను రూపొందించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వం లక్ష్యం కొత్త ప్రాజెక్టులను ప్రకటించడమే కాకుండా, ఇప్పటికే ప్రారంభమై అసంపూర్తిగా ఉన్న ప్రధాన సాగునీటి పథకాలను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడమేనని అధికార వర్గాలు చెబుతున్నాయి. సవరించిన అంచనాల్లో అత్యధికంగా నాలుగు ప్రధాన ప్రాజెక్టుల వ్యయమే పెరిగినట్టు తెలుస్తోంది. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, దేవాదుల, పాలమూరు--రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ వంటి ప్రధాన పథకాలతో పాటు గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో కొనసాగుతున్న ఇతర ప్రాజెక్టులకు కూడా వ్యయ అంచనాలు పెంచినట్టు సమాచారం. ఈ నాలుగు ప్రధాన ప్రాజెక్టులకే దాదాపు రూ. 35 వేల కోట్ల అదనపు వ్యయాన్ని ప్రతిపాదించినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

**గోదావరి, కృష్ణా బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులకు సవరణలు**

కేవలం ఒకటి రెండు ప్రాజెక్టులకు మాత్రమే కాకుండా గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో కొనసాగుతున్న దాదాపు అన్ని ప్రధాన నీటిపారుదల పథకాల వ్యయాలను సవరించినట్టు తెలుస్తోంది. వీటిలో ముఖ్యంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, సీతమ్మసాగర్, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, పాలమూరు--రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్‌బీసీ టన్నెల్, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, గౌరవెల్లి, ఇతర ప్రాజెక్టులు ఉన్నట్లు సమాచారం.

**వ్యయం ఎందుకు పెరిగింది?**

గత బీఆర్ఎస్ హయాంలో రూపొందిన ప్రాజెక్టు వ్యయానికి, ఇప్పటితో పోలిస్తే సుమారుగా రూ. 1,26,960 కోట్లు అధికంగా ప్రతిపాదించారు. ఇంత పెద్ద మొత్తంలో అంచనాలు పెరగడానికి కారణాలూ లేకపోలేదు. ప్రధానంగా సిమెంట్, స్టీల్, డీజిల్ తదితర నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల, భూసేకరణ, పునరావాసం (ఆర్అండ్ఆర్) వ్యయం పెరగడం, పర్యావరణ, అటవీ అనుమతుల ఆలస్యం, కోర్టు కేసుల కారణంగా పనులు నిలిచిపోవడం, డిజైన్ మార్పులు, అదనపు నిర్మాణ అవసరాలు, కాంట్రాక్ట్ కాలం పొడిగింపు వల్ల వ్యయం పెరగడం, ద్రవ్యోల్బణ ప్రభావం తదితర కారణాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని తాజా అంచనాలను రూపొందించినట్టు సమాచారం.

**నేడు కేబినెట్ ముందుకు ఫైల్..**

నీటి పారుదల శాఖ అధికారులు సవరించిన అంచనాలను నేడు కేబినెట్ ముందుకు పంపిస్తున్నట్టు తెలిసింది. నేటి కేబినెట్‌లో ప్రధానంగా సవరించిన అంచనాలకు ఆమోదంపైనే చర్చించనున్నట్టు తెలిసింది. అందులోనూ ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ప్రాజెక్టులుగా తీసుకున్న ఎస్ఎల్‌బీసీ, పాలమూరు-రంగారెడ్డి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల సవరించిన అంచనాలకు గ్రీన్ సిగ్నల్ తెలుపనున్నట్టు తెలుస్తోంది మిగతా వాటి మీద తదుపరి నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. ఈ నాలుగు ప్రాజెక్టులను మాత్రం ప్రాధాన్యత అంశంగా చర్చించి.. వాటికి ఆమోదం తెలుపుతారని సమాచారం.

# పౌరసత్వాన్ని నిర్ణయించే అధికారం ఈసీకి లేదు..

న్యూ ఢిల్లీ : ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించినంత మాత్రాన సదరు వ్యక్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపివేయవచ్చా? అనే అత్యంత కీలకమైన అంశాన్ని పరిశీలించడానికి భారత అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) అంగీకరించింది. పశ్చిమ బెంగాల్‌లో సాగుతున్న 'ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాల నుంచి తొలగించబడిన వారికి రేషన్, ఇతర సామాజిక భద్రతా పథకాలను నిరాకరించకూడదని కోరుతూ దాఖలైన పిటిషన్ పై కోర్టు స్పందించింది. ఈ మేరకు ధర్మాసనం శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం (EC)తో పాటు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అనంతరం ఈ కేసును జూలై 25 కు వాయిదా వేసింది.

**పిటిషనర్ అభ్యర్థన ఏమిటి?**

ప్రముఖ సామాజిక కార్యకర్త ప్రసేన్‌జిత్ బోస్ దాఖలు చేసిన ఈ పిటిషన్లో పలు కీలక అంశాలను లేవనెత్తారు. ఓటర్ల జాబితా నుంచి పేరును తొలగించినంత మాత్రాన ప్రజలకు

రాజ్యాంగబద్ధంగా అందాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS/రేషన్), అన్నపూర్ణ పథకం, కుల ధృవీకరణ పత్రాలు, ఇతర సామాజిక పింఛన్లు వంటి ప్రాథమిక ప్రయోజనాలను నిలిపివేయడం సరికాదని వాదించారు. పౌరసత్వం, ఓటు హక్కుకు సంబంధించిన వివాదాలు తుది కొలిక్కి వచ్చే వరకు పేద ప్రజలను సంక్షేమ పథకాల నుంచి దూరం చేయకుండా రక్షణ కల్పించాలని కోరారు. పిటిషనర్ తరపున సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ బలమైన వాదనలు వినిపించారు. "పశ్చిమ బెంగాల్లోని ప్రత్యేక ట్రిబ్యునళ్ల ముందు ప్రస్తుతం దాదాపు 34 లక్షల అప్పీళ్లు పెండింగ్లో ఉన్నాయి.

కానీ, కేవలం 38,000 అప్పీళ్లను మాత్రమే ఇప్పటివరకు పరిష్కరించారు. దీనికి తోడు రాష్ట్రంలో ఈ అప్పీళ్లను డీల్ చేయడానికి కేవలం 19 ట్రిబ్యునళ్లు మాత్రమే ఉన్నాయి. అందులోనూ ఇద్దరు జడ్జీలు ఇప్పటికే రాజీనామా చేశారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నప్పుడు, అప్పీళ్లపై తుది నిర్ణయం రాకముందే లబ్ధిదారులకు పథకాలు నిలిపివేయడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ట్రిబ్యునల్స్ పనితీరులో పారదర్శకత ఉండాలని, వాటి కోసం ప్రత్యేక వెబ్సైట్లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఆర్డర్లను అప్లోడ్ చేయాలని కోరారు. "ఒక వ్యక్తి వద్ద భారత పాస్పోర్ట్ ఉంటే దానిని పౌరసత్వానికి రుజువుగా అంగీకరించాలి. మళ్లీ మరిన్ని డాక్యుమెంట్లు అడగడం ఏంటి? అని ఆయన ప్రశ్నించారు.

**ఎన్నికల సంఘానికి పౌరసత్వాన్ని తేల్చే అధికారం లేదు..**

సుప్రీంకోర్టు ఈ వాదనలపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ, గతంలో బిహార్ SIR ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తుచేశారు. "ఓటు హక్కుకు సంబంధించిన నిర్ణయం తీసుకునే క్రమంలో ఒక వ్యక్తి భారత పౌరుడా కాదా అని నిర్ణయించే అధికారం ఎన్నికల సంఘానికి లేదు. ఆ విషయాన్ని ఈసీ కేవలం హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు మాత్రమే రిఫర్ చేయాల్సి ఉంటుంది" అని స్పష్టం చేశారు. అయితే చట్ట ప్రకారం ఓటర్ల జాబితాపై పూర్తి పర్యవేక్షణ, నియంత్రణ అధికారాలు మాత్రమే ఎన్నికల సంఘానికి ఉంటాయని కోర్టు పునరుద్ఘాటించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం తమకు ఉన్న విశేషాధికారాలను ఉపయోగించి, బాధితుల పౌరసత్వ వివాదాలు తేలే వరకు వారి సెంక్షేమ పథకాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని పిటిషనర్ కోరగా, దీనిపై తదుపరి విచారణలో సమగ్రంగా పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది.

# ఫిఫా వరల్డ్ కప్ జోష్

హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : ప్రపంచ వ్యాప్తంగా ఫుట్‌బాల్ ప్రేమికులను ఎంతగానో అలరిస్తున్న ఫిఫా వరల్డ్ కప్ క్లైమాక్స్‌కు చేరింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచకప్ మ్యాచ్‌ల లైవ్ టెలికాస్ట్‌ను వీక్షించే ఫుట్‌బాల్ ప్రియులు, మందుబాబులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇక తెల్లవారుజాము వరకు మద్యం అమ్మకాలకు అనుమతినిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ చేసిన స్పెషల్ రిక్వెస్ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ, ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది.కాగా, ఫిఫా వరల్డ్ కప్ థర్డ్ ప్లేస్ ప్లే-ఆఫ్ మ్యాచ్ జరిగే జులై 18న అంటే రేపు రాత్రి ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. ఆ ఉత్తర్వుల ప్రకారం జులై 19 తెల్లవారుజామున 4.30 గంటల వరకు మద్యం అమ్మకాలకు అనుమతి ఉంటుంది. ఇక అత్యంత ప్రతిష్టాత్మకమైన వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ జరిగే జులై 19న అర్ధరాత్రి నుంచి 20 తెల్లవారుజామున 3 గంటల వరకు బార్లలో మద్యం విక్రయాలు జరుపుకునే అవకాశం కల్పించారు. అయితే, ప్రభుత్వం కల్పించిన ఈ ప్రత్యేక అర్ధరాత్రి సమయాల వెసులుబాటు కేవలం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని బార్లు, క్లబ్బులు, మైక్రోబ్రూవరీలకు మాత్రమే వర్తిస్తుందని ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఫిఫా ఫైనల్స్ వేళ నగరంలో ఫుట్‌బాల్ ఫీవర్ మరింత ఊపందుకోనుంది.



# భూ సమస్యల పరిష్కారానికే రీ-సర్వే

శాలిగౌరారం,ఫ్లాష్ ఇండియా : రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని నల్గొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం శాలిగౌరారం మండలం వద్దిపాముల గ్రామంలో నిర్వహించిన భూ రీ-సర్వే అవగాహన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామసభలో రైతులు బాటలు, దారుల సమస్యలు, పట్టాలు లేకపోవడం, భూమి ఉన్నప్పటికీ కబ్జాలో లేకపోవడం వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు భూ రికార్డులను నవీకరిస్తున్నప్పటికీ నక్షాలు, టిప్పన్లు వంటి పాత రికార్డుల్లో మార్పులు లేకపోవడం, క్షేత్రస్థాయిలో భూముల గుర్తింపులో ఇబ్బందులు ఉండటం వల్ల రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాటి పరిష్కారానికే భూముల రీ-సర్వే చేపట్టినట్లు వివరించారు. రీ-సర్వేలో భాగంగా ముందుగా గ్రామ హద్దులు, ప్రభుత్వ ఆస్తులు, వ్యవసాయేతర భూములను సర్వే చేసి, అనంతరం రైతులు, గ్రామస్థుల సమక్షంలో వ్యవసాయ భూముల సర్వే



నిర్వహిస్తామని చెప్పారు. పహానీ ఆధారంగా ప్రతి భూమికి ల్యాండ్ పార్సెల్ నంబర్ కేటాయించి, అనంతరం అన్ని పార్సెల్‌లను అనుసంధానం చేస్తూ భూదార్ నంబర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. భూదార్ నంబర్ ఆధారంగా భూముల వివరాలు అందుబాటులోకి వస్తాయని, ముసాయిదా జాబితాను గ్రామంలో ప్రకటించి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత తుది జాబితా విడుదల చేస్తామని చెప్పారు. కోర్టు కేసులు, ఎఫ్ఐఆర్‌లు తదితర అంశాలను కూడా పరిశీలించిన తర్వాతే భూముల హద్దులు ఖరారు చేసి మ్యాప్‌లు అందజేసామని వివరించారు. రీ-సర్వే ప్రక్రియలో రైతులు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సహకరించాలని, ఈ ప్రక్రియ ద్వారా కొత్త వివాదాలు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ కోరారు. అనంతరం స్థానిక కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూనిఫాం సమస్యను విద్యార్థులు ప్రస్తావించగా, రెండు రోజుల్లో టైలర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తర్వాత స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీఎచ్‌సీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను పరిశీలించిన కలెక్టర్ రికార్డుల నిర్వహణలో అలసత్వం, సమయపాలన లోపం, విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బందిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల ప్రజలకు సరైన వైద్య సేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నల్గొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, తహసీల్దార్ మాధవరావు, ఎంపీడీవో జాల రజిత, తక్కెల్లపహాడ్, శాలిగౌరారం గ్రామాల సర్పంచులు సురేందర్ రెడ్డి, గుజిలాల్ శేఖర్ బాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగే నర్సింహా, రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు ఉన్నవారికి బిగ్ అలర్ట్..



హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు పౌర సరఫరాల శాఖ కీలక సూచనలు చేసింది. రాష్ట్రంలో ఉచితంగా రేషన్ కార్డు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవడానికి విధించిన గడువు ఈ నెల 31తో ముగియనుందని స్పష్టం చేసింది. రేషన్ కార్డులో పేరున్న ప్రతి సభ్యుడు గడువులోగా తమ ఈ-కేవైసీ ని ఖచ్చితంగా పూర్తి చేసుకోవాలని అధికారులు వెల్లడించారు. లబ్ధిదారులు తమ రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులను తీసుకొని స్థానిక రేషన్ డీలర్ వద్ద లేదా సమీపంలోని 'మీ సేవ' కేంద్రానికి గానీ వెళ్లి బయోమెట్రిక్, ఐరిస్ ద్వారా ఉచితంగా ఈ-కేవైసీ చేయించుకోవచ్చు. ఒకవేళ నిర్ణీత గడువు లోపు ఈ-కేవైసీ పూర్తి చేయని వారికి భవిష్యత్తులో రేషన్ పంపిణీ నిలిచిపోయే ప్రమాదం ఉందని పౌర సరఫరాల శాఖ హెచ్చరించింది. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం, ఇతర సరుకులు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపింది.కాగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నకిలీ రేషన్ కార్డులను ఏరివేయడంతో పాటు, అర్హులైన అసలైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూసేందుకు పౌర సరఫరాల శాఖ ఈ వ-ఖ్జ ప్రక్రియను తప్పనిసరి చేసింది. ఈ క్రమంలోనే లబ్ధిదారులు ఈ నెల 31వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.




ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# బీజేపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తాము అధికారంలోకి వస్తే కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి విమర్శించారు. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్న హామీ మేరకు కాంగ్రెస్ నేతలకు చెందిన షో రూమ్‌లలో స్కూటీలు ఎత్తుకెళ్లాలన్నారు. ఇవాళ నిజామాబాద్ ఫీజురియంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని 'ఇందూర్ రణభేరి' లో మాట్లాడిన రాశేక్ రెడ్డి.. ఉచితంగా స్కూటీలు ఇస్తామని ప్రియాంక గాంధీ హామీ ఇచ్చారు. ఇప్పుడు నేను చెబుతున్నా విద్యార్థినులు కాంగ్రెస్ నేతల షో రూమ్‌లలోని స్కూటీలు ఎత్తుకెళ్లాలని రాకేశ్ రెడ్డి పిలుపునిచ్చారు.

**అగ్గిరాజేస్తాం:**

ఫీజు రీయింబర్స్ మెంట్ ఇచ్చే వరకు ఊరుకోబోయేది లేదని, నిజామాబాద్ గడ్డపై పుట్టిన అగ్గి రాష్ట్రమంతటా రాజేస్తామని హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్ మెంట్ ఫైల్ పైనే బీజేపీ సీఎం తొలి సంతకం పెట్టబోతున్నట్లు చెప్పారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఎలాంటి ఢోకా లేదని విద్యార్థులకు అండగా బీజేపీ నిలుస్తుందన్నారు. అవసరం అయితే చలో కొండారెడ్డి పల్లి, కొడంగల్ కార్యక్రమం తీసుకుంటామన్నారు.

**ఎండ్రిన్ తాగమంటారా?**

ఉద్యోగాలు ఇవ్వమన్న మా నిరుద్యోగులు ఎండ్రిన్ తాగమని, బావిలో దూకమని అంటారా? అని మండిపడ్డారు. ఈ బిడ్డలను మీరు కన్నారా పెంచారా? అని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి తన మనువడి కోసం 20 వేల కోట్లు పెట్టి ఫుట్ బాల్ స్టేడియం కట్టారు. మరి పేదల తాతలు, తండ్రులు ఏం కావాలని ప్రశ్నించారు. పేదలు చదవద్దని కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నీళ్లు అడిగితే రక్తం పారిస్తామంటున్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నేతల రక్తం, కొవ్వు కరిగించాలని రైతుల ఎదురు చూస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి.. అహంకారం తలకెక్కిందా అని ప్రశ్నించారు.

# డిజిటలైజేషన్ 60 శాతం పూర్తి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ఇప్పటి వరకు ఎస్ఐఆర్ ప్రక్రియ డిజిటలైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరులో ఎస్ఐఆర్ శిబిరాలను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో కలిసి పరిశీలించారు. సర్ గడువు పొడిగింపు తేదీని దృష్టిలో ఉంచుకుని ప్రక్రియను కొనసాగించాలని బీఎల్వోలకు ఈ సందర్భంగా సూచించారు. గ్రామాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 50 శళాతం ఎస్ఐఆర్ పూర్తయిందని చెప్పారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందని వారు సర్ ప్రక్రియ సూపర్ వైజర్లను అడిగి పత్రాలు తీసుకోవాలని చెప్పారు.

**గడువు పెంచిన ఈసీ:**

కాగా రాష్ట్రంలో సర్ సర్వే షెడ్యూల్ లో కేంద్ర ఎన్నికల కమిషన్ మార్పులు చేసిన సంగతి తెలిసిందే. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ పత్రాలను బీఎల్ఓలకు అందించే గడువ ఈ నెల 24వ తేదీ వరకు ఉండగా దాన్ని ఆగస్టు 3 వరకు పెంచింది. ముసాయిదా జాబితా ప్రచురణ వచ్చే నెల 10కి, ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణను ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు, వివరాల్లో తేడాలున్న ఓటర్లకు నోటీసులు ఇచ్చే సమయం ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 వరకు, తుది జాబితా అక్టోబర్ 12వ తేదీకి మార్చింది.

# నిధులు మళ్లిస్తే ఊరుకునేది లేదు

**రాజన్న సిరిసిల్ల,ఫ్లాష్ ఇండియా :** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని, గ్రామాల అభివృద్ధి పనుల కోసం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలకు మళ్లించడం దుర్మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన సిరిసిల్లలో పర్యటించారు. సిరిసిల్ల పట్టణంలో జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, ఎస్పీ మహేశ్ బి.గీతే, బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపీ, స్థానిక బీజేపీ నేతలతో కలిసి అమృత్ 2 స్కీమ్ కింద రూ.1.32 కోట్ల నిధులతో చేపట్టిన కార్గిల్ చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. పక్కనే ఉన్న కార్గిల్ యుద్ధ శకటాన్ని సందర్శించి, కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించారు.అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. కార్గిల్ చెరువు పునరుద్ధరణ చేసి మురుగునీరు రాకుండా సుందరికారంగా తీర్చిదిద్ది జిల్లా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ చెరువును సందర్శించేలా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతమన్నారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంట్రాక్టర్లు రాష్ట్రమంతా కాంటాక్ట్ ను పట్టుకుని, ఎక్కడ పూర్తి స్థాయిలో పనులు చేయడం లేదని , ఇతర కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వకుండా సిండికేట్ లా మారి ఇబ్బందులు పెడుతున్నారని, ఇకపై అలా జరగకుండా చూస్తామని తెలిపారు. అమృత్ స్కిమ్‌ను గొప్ప ఆశయంతో ప్రధానమంత్రి మోదీ ప్రారంభించారన్నారు. అమృత్ 1 మిషన్ కింద రూ.77 వేల 640 కోట్ల వ్యయం అంచనా వేస్తే కేంద్రం 35 వేల 990 కోట్లు కేటాయించింది. 2021 నాటికి అమృత్ 1 స్కీం పూర్తయ్యిందని , 2021 అక్టోబర్ లో అమృత్ 2 స్కీం పేరుతో 2 లక్షల 99 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తే, అందులో కేంద్రం తన వాటాగా 76 వేల 760 కోట్లు కేటాయించిందన్నారు.అమృత్ 1 కింద తెలంగాణకు 1660 కోట్లు, అమృత్ 2 కింద 3వేల 429 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించిందని, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు సిరిసిల్ల, వేములవాడ, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీలు అమృత్ పథకం కింద దాదాపు 400 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. తెలంగాణకు 12 ఏళ్లలో 13 లక్షల కోట్ల రూపాయలను కేంద్రం ఖర్చు చేసిందని, అయినా తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పచ్చి అబద్ధాలాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా నయాపైసా కూడా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు ఇవ్వడం లేదని, సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నయాపైసా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.అమృత్ స్కీం కింద కేంద్రం గ్రామాల అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులిస్తే…వాటిని అభివృద్ధి పనులకు కాకుండా కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతాల కోసం ఖర్చు చేస్తూ నిధులు డైవర్ట్ బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను ఆ లక్ష్యానికే ఉపయోగించాలని, ఆ నిధులను దారి మళ్లిస్తే ఊరుకునేది లేదని, ప్రభుత్వం తీరు మారకుండా కేంద్రానికి తాను లేఖ రాస్తే నిధులు ఆగిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. అదే సమయంలో కేంద్ర నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం సిబ్బంది జీతభత్యాలు, కరెంట్ బిల్లులకు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉండడం బాధాకరమన్నారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**లీగల్ నోటీసులే జర్నలిస్టులకు రివార్డులు అవార్డులు..**

సిరిసిల్ల పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడుతున్న క్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ హాస్య స్పద వ్యాఖ్యలు చేశారు. సిరిసిల్లలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై ఫుడ్ ఇన్స్పెక్టర్ పనితీరును మీడియా ప్రతినిధులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని, మీడియా ప్రతినిధులకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లీగల్ నోటీసులు పంపిస్తానని బెదిరిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో బండి సంజయ్ స్పందిస్తూ మీడియా ప్రతినిధులకు లీగల్ నోటీసులు కొత్తేమి కాదని, వచ్చే లీగల్ నోటీసులే వారికి అవార్డులు, రివార్డులని తెలిపారు. అలాగే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ విషయంపై జిల్లా కలెక్టర్ తో మాట్లాడతానన్నారు.

# భయంతోనే అనుమతి నిరాకరణ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'యువ సంగ్రామ సదస్సు'కు పోలీసులు అనుమతి నిరాకరించడంపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రభుత్వ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులు అనుమతి ఇవ్వలేదని.. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

**గత నెలలోనే దరఖాస్తు: శంబీపూర్ రాజు:**

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు మాట్లాడుతూ.. యువ సంగ్రామ సదస్సు కోసం గత నెలలోనే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నామని, కలెక్టర్ అనుమతి లేఖ ఆధారంగా స్పోర్ట్స్ అథారిటీకి సమాచారం ఇచ్చామన్నారు. జూలై 8న సీపీకి అధికారికంగా లేఖ అందజేసి పోలీసులు కోరిన విధంగా సీసీ కెమెరాల ఏర్పాటు, డీడీల చెల్లింపులు వంటి అన్ని నిబంధనలను పాటించినప్పటికీ చివరి నిమిషంలో అనుమతి నిరాకరించారన్నారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, తాను చేసిన ఫోన్ కాల్స్‌కు కూడా సీపీ స్పందించడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే సభకు అనుమతి ఇవ్వవద్దని పోలీసు అధికారులకు ఆదేశాలు వెళ్లినట్లు తెలుస్తోందని ఆరోపించారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తామనే భయంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, నిరుద్యోగుల పట్ల ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్న తీరు బాధాకరమని అన్నారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా యువ సంగ్రామ సదస్సు విజయవంతమవుతుందని, యువత పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. అనుమతి నిరాకరణపై న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వెల్లడించారు.

**నిరుద్యోగుల గొంతు నొక్కే కుట్ర: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ జూన్ 30న దరఖాస్తు చేసినా జూలై 18 వచ్చినా పోలీసులు అనుమతి ఇవ్వకుండా కాలయాపన చేశారని మండిపడ్డారు. ఎన్నికల వేళ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పించి.. ఇప్పుడు నిరుద్యోగులను నట్టేట ముంచారు. వయోపరిమితి సడలింపు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై ప్రశ్నిస్తున్న విద్యార్థులపై దమనకాండ సాగిస్తున్నారు. యువత పెద్ద ఎత్తున సభకు హాజరైతే ఎక్కడ ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతుందోననే భయంతోనే రేవంత్ సర్కార్ సభను అడ్డుకుంటోందని అని విమర్శించారు. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే సరూర్‌నగర్ స్టేడియం వద్దే నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

# ధరణిపై దర్యాప్తునకు సిట్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయం వేదికగా దాదాపు మూడు గంటల పాటు నిర్విరామంగా జరిగిన కేబినెట్ భేటీ కాసేపటి క్రితం ముగిసింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రజలు, రాజకీయ వర్గాల్లో ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న పలు కీలక అంశాలపై చర్చించి మంత్రిమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. ఇందులో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల ప్రక్షాళన కొరకు ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్‌పై రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. 'ధరణి' పోర్టల్ నిర్వహణ, అందులో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపేందుకు ఓ ప్రత్యేక విచారణ బృందాన్నిఏర్పాటు చేసేందుకు కేబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది. అయితే, గత కొన్నేళ్లుగా ధరణి పోర్టల్‌లో ఉన్న లొసుగులు, దాని ఆధారంగా జరిగిన భూ ఆక్రమణలు, వివాదాస్పద లావాదేవీలపై 'సిట్' సమగ్రంగా దర్యాప్తు చేపట్టనుంది. ఎవరెవరి భూములు అక్రమంగా చేతులు మారాయి..? అందులో ఎవరి ప్రమేయం ఎంత అనే కోణంలో విచారణ అధికారులు ఆధారాలు సేకరించనున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ లావాదేవీల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత పొలిటికల్ హీట్ పెంచే అవకాశం కనిపిస్తోంది.

**మరికొన్ని కీలక నిర్ణయాలు ఇవే..**

అదేవిధంగా ఈ మంత్రివర్గ సమావేశంలో విద్యాశాఖలో పోస్టుల భర్తీకి కూడా ఆమోదం తెలిపారు. సంగారెడ్డిలో వివిధ సంస్థలకు గాను భూ కేటాయింపులకు ఆమోదముద్ర వేశారు. ఇక నీటిపారుదల రంగానికి సంబంధించి పాలమూరు ప్రాజెక్టుకు పెరిగిన అంచానాలకు ఆమోదం తెలిపారు. ఇక బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పులకు కూడా ఓకే చెప్పేశారు. గ్రామ పంచాయతీల ఆర్థిక వెసులుబాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా జగిత్యాల జిల్లాలో డిగ్రీ కాలేజ్‌లో పోస్టుల భర్తీకి, పటాన్‌చెరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**గ్రామ పంచాయతీలకు గుడ్‌న్యూస్..**


తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ధి చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అలాగే ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు వచ్చే సొంత ఆదాయం (పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు) ప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది.



# చిట్యాల ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలి

**చిట్యాల,ఫ్లాష్ ఇండియా :** చిట్యాల పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం వినూత్నంగా నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించిన నాయకులు అనంతరం ఫ్లైఓవర్ కింద కళ్లకు గంతలు కట్టుకొని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి మాట్లాడుతూ... ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి రెండేళ్లు పూర్తయినా పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. ఆరు నెలల్లో పూర్తి చేస్తామని ప్రకటించిన ప్రజాప్రతినిధులు ఇప్పటికీ పనులు పూర్తి చేయించలేకపోవడం వారి అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. చిట్యాల పట్టణంలో అధిక జనాభా, జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ కారణంగా ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో వ్యాపారులు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సింగిల్ విండో వైస్ చైర్మన్ మెండే సైదులు, నాయకులు జమాండ్ల శ్రీనివాస్ రెడ్డి, బొబ్బిలి శివశంకర్ రెడ్డి, జిట్ట బొందయ్య, కౌన్సిలర్లు నిమ్మనుకోటి శ్రీను, ఎస్.కె. షబానా అజీముద్దీన్, కందాటి రమేష్ రెడ్డి, ఆగు అశోక్, కన్నెబోయిన శ్రీశైలం, రుద్రవరం యాదయ్య, మారగోని రమేష్, కృష్ణ నాయక్, ఆవుల ఆనంద్, జిట్ట శేఖర్, సాయిరెడ్డి ప్రతాపరెడ్డి, పోకల రాములు, కూనూరు శంకర్, పాల కృష్ణయ్య, రామగిరి జనార్దన్ రావు, రుద్రారపు కృష్ణ, బాలు, మాసపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే ఉపసంహరించుకోవాలి



**హిమాయత్ నగర్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులపై తీసుకొచ్చిన రెవెన్యూ రికవరీ యాక్ట్ ను తక్షణమే ఉపసంహరించుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్కాలర్ షిప్స్ , ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు 8 వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తెలంగాణ విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్ పటేల్ అధ్యక్షతన హైదరాబాద్ కలెక్టరేట్ ముందు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో విద్యార్థి సంఘ నాయకులు చొక్కాలు విప్పి అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ ఆందోళనకు మద్దతు ఇచ్చిన ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ... ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్ర చేస్తుందని విమర్శించారు. ఈ పథకం వల్ల అణగారిన వర్గాలు ఉన్నత చదువులు చదువుతున్నాయని , పథకంపై ఎలాంటి ఆంక్షలు లేకుండా యథావిధిగా కొనసాగించాలని కోరారు. 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు విఘాతం కలిగించే చర్యలపై తన పోరాటం కొనసాగుతుందని ఆర్ కృష్ణయ్య స్పష్టం చేశారు. ఆగస్టు 15 న లోపు ఫీజు బకాయిలు చెల్లించని పక్షంలో మిలిటెంట్ ఉద్యమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన ప్రదర్శనలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు నీలా వెంకటేష్, అనంతయ్య, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన డివిజన్ అధ్యక్షులు కర్రె రాజేష్



**ఘట్కేసర్ (కచవానిసింగారం), ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోచారం 8వ డివిజన్ అధ్యక్షులుగా కర్రె రాజేష్ నియమతులైన సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు డివిజన్లోని ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం కాచవానిసింగారం గ్రామంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ కర్రె జంగమ్మ, పోచారం మున్సిపల్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి మహిళా అధ్యక్షురాలు మాధవి జనరల్ సెక్రెటరీ కృష్ణారెడ్డి బద్దం నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీలు వార్డ్ మెంబర్లు మాజీ ఉపసర్పంచ్ లతో కలిసి అధ్యక్షులు కర్రె రాజేష్ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కర్రె రాజేష్ మాట్లాడుతూ పోచారం 8వ డివిజన్ అధ్యక్షునిగా నియమించినందుకు సీఎం,పీసీసీ అధ్యక్షులు కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను మూడోసారి అధ్యక్షునిగా ఎన్నికైన సంతోషంగా ఉందని దీనికి ప్రజల అండదండలు పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి ఎంతో తనపై ప్రజల ప్రేమాభిమానాలకు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు దక్కుతుందని, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. కాంగ్రెస్ రెండున్నర ఏళ్ల పాలనలో ఎక్కడికి అక్కడ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ సహకారంతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతులు ఏర్పాటు డివిజన్ అభివృద్ధి చేయడం తన బాధ్యత అని ఈ సందర్భంగా తెలిపారు. గత పాలనలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా తన విజయానికి తోడ్పాటు అందించిన నాగులపల్లి శ్రీనివాస్,ఐలేష్ లు ఎంపిటిసిలకు మాజీ సర్పంచ్ లకు కార్యకర్తలకు సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు

# డిజిటల్ ఉచ్చులో బాల్యం..



ఒకప్పుడు సాయంత్రం అయిందంటే గ్రామమైనా, పట్టణమైనా వీధులన్నీ పిల్లల కేరింతలతో మార్మోగేవి. క్రికెట్ బ్యాట్, బంతి, గిల్లీదండా, కబడ్డీ, కోకో, దాగుడుమూతలు వంటి ఆటలతో పిల్లలు గంటల తరబడి గడిపేవారు. ఆ ఆటలు వారికి శారీరక ఆరోగ్యాన్నే కాదు, స్నేహం, సహకారం, నాయకత్వం, ఓర్పు, ఓటమిని అంగీకరించే మనస్త్వం వంటి జీవిత విలువలను కూడా నేర్పించేవి. నేడు ఆ దృశ్యాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. వీధుల్లో ఆటల సందడి తగ్గిపోగా, ఇళ్లలో మొబైల్ స్క్రీన్ల వెలుగులు పెరిగాయి. పిల్లల చేతుల్లో బంతుల స్థానంలో స్మార్ట్‌ఫోన్లు చేరాయి. సాంకేతికత మన జీవితాన్ని సులభతరం చేసినా, అదే సాంకేతికత నియంత్రణ లేకుండా పిల్లల చేతుల్లో పడినప్పుడు వారి బాల్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని, భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నది. డిజిటల్ ప్రపంచం నేటి పిల్లలకు కేవలం వినోద సాధనం మాత్రమే కాదు; వారి రోజువారీ జీవితంలో భాగమైపోయింది. ముఖ్యంగా 9 నుంచి 12 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలు ఆన్‌లైన్ గేమింగ్, షార్ట్ వీడియోలు, సోషల్ మీడియా వంటి వేదికల ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నారు. వారి వ్యక్తిత్వ వికాసం, విద్యాభ్యాసం, సామాజిక సంబంధాలు, కుటుంబ బంధాలు అన్నింటిపైనా ఈ ప్రభావం కనిపిస్తోంది. ఇది కేవలం కుటుంబాల సమస్య కాదు; సమాజం మొత్తం ఆలోచించాల్సిన అంశంగా మారింది.

### దోపమైన్ ఉచ్చు... బందీ అవుతున్న బాల్యం

ఆన్‌లైన్ గేమింగ్, షార్ట్ వీడియో యాప్‌ల విజయానికి ప్రధాన కారణం వాటి వెనుక పనిచేసే అల్గారిథమ్‌లు. పిల్లల ఆసక్తిని క్షణక్షణం నిలబెట్టేలా వీటిని రూపొందిస్తారు. ఒక గేమ్ లెవెల్ పూర్తయినా, ఒక రివార్డు వచ్చినా, ఒక కొత్త వీడియో కనిపించినా మెదడులో "డోపమైన్" అనే రసాయనం విడుదలవుతుంది. ఇది ఆనందాన్ని కలిగించే సహజ ప్రక్రియే అయినప్పటికీ, అదే పదేపదే జరిగితే పిల్లలు తక్షణ సంతృప్తికే అలవాటు పడిపోతారు. దీని ఫలితంగా ఓపిక తగ్గిపోతుంది. పుస్తకం చదవడం, ఒక పాఠాన్ని అర్థం చేసుకోవడం, హోంవర్క్ పూర్తి చేయడం వంటి పనులు వారికి భారంగా అనిపిస్తాయి. ప్రతి కొద్దిసేపుకూ ఫోన్ చూడాలనే కోరిక పెరుగుతుంది. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలపై ఏకాగ్రత నిలవదు. విద్యార్థులలో దృష్టి లోపం, చిరాకు, అసహనం, భావోద్వేగ అస్థిరత పెరుగుతున్నాయని ఉపాధ్యాయులు, మానసిక నిపుణులు కూడా తరచూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఆటల స్థానంలో అల్గారిథమ్‌లు

బహిరంగ ఆటలు పిల్లల శారీరక ఎదుగుదలకు మాత్రమే కాదు, సామాజిక వికాసానికి కూడా ఎంతో అవసరం. మైదానంలో ఆడే ఆటలు జట్టు భావన, పరస్పర గౌరవం, నియమాలను పాటించే అలవాటు, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి. అయితే మొబైల్ గేమింగ్ ఈ అనుభవాలన్నింటినీ క్రమంగా దూరం చేస్తోంది. ఇప్పుడు చాలామంది పిల్లలు స్నేహితులను కలవడం కంటే వర్చువల్ ప్రపంచంలోని తెలియని వ్యక్తులతో గంటల తరబడి గేమ్స్ ఆడుతున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడే సమయం తగ్గుతోంది. భోజనం చేసే సమయంలో, ప్రయాణాల్లో, సెలవు రోజుల్లో కూడా ఫోన్ లేకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇది కుటుంబ సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది.

### ఎందుకు 9--12 ఏళ్ల పిల్లలే ప్రధాన లక్ష్యం?

డిజిటల్ మార్కెట్‌లోని అనేక గేమింగ్, వీడియో యాప్‌లు ఈ వయస్సు పిల్లలనే తమ ప్రధాన వినియోగదారులుగా మార్చుకోవడానికి ప్రత్యేక వ్యూహాలు అవలంబిస్తున్నాయి. ఈ దశలో పిల్లల మెదడు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, నిర్ణయ సామర్థ్యం పూర్తిగా పరిపక్వం చెందదు. ఆకర్షణీయమైన రంగులు, యానిమేషన్‌లు, నిరంతర రివార్డులు, నోటిఫికేషన్‌లు వారిని ఎక్కువసేపు యాప్‌లోనే ఉంచేలా చేస్తాయి. పిల్లల దృష్టిని ఎక్కువసేపు ఆకర్షించగలిగితే ప్రకటనల ద్వారా, గేమ్ కొనుగోళ్ల ద్వారా కంపెనీలకు అధిక ఆదాయం వస్తుంది. అందుకే వారి మానసిక స్వభావాన్ని అధ్యయనం చేసి ప్రత్యేకంగా రూపొందించిన ఫీచర్లను ప్రవేశపెడుతున్నారు. వ్యాపార ప్రయోజనాల కోసం బాల్య మనస్తత్వాన్ని వినియోగించడం సమాజంలో ఆందోళన కలిగించే అంశమే.

### చదువుపై తీవ్ర ప్రభావం

మొబైల్ వ్యసనం ప్రభావం మొదటగా కనిపించేది విద్యాభ్యాసంపైనే. ఆన్‌లైన్ గేమ్స్‌లో గంటల తరబడి గడిపే పిల్లలు హోంవర్క్‌ను వాయిదా వేయడం, పరీక్షలకు సరిగా సిద్ధం కాకపోవడం, పాఠ్యాంశాలపై ఆసక్తి కోల్పోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయుల మాటలు వినడం కంటే స్క్రీన్‌పై వేగంగా మారే చిత్రాలే వారికి ఆసక్తికరంగా కనిపిస్తున్నాయి. ఇది కేవలం మార్కుల తగ్గుదలకు మాత్రమే పరిమితం కాదు. సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, దీర్ఘకాలిక ఏకాగ్రత, సృజనాత్మక ఆలోచన వంటి కీలక నైపుణ్యాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.

### మానసిక ఆరోగ్యంపై ప్రభావం

అధిక స్క్రీన్ టైమ్ వల్ల పిల్లల్లో నిద్రలేమి, ఆందోళన, ఒత్తిడి, చిరాకు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. రాత్రి ఆలస్యంగా వరకు మొబైల్ ఉపయోగించడం వల్ల నిద్ర నాణ్యత తగ్గుతుంది. తగిన విశ్రాంతి లేకపోవడంతో మరుసటి రోజు చదువుపై ప్రభావం పడుతుంది. కొంతమంది పిల్లల్లో సామాజిక ఒంటరితనం, ఆత్మవిశ్వాసం తగ్గడం, వాస్తవ ప్రపంచం కంటే వర్చువల్ ప్రపంచానికే ప్రాధాన్యం ఇవ్వడం వంటి ధోరణులు కూడా కనిపిస్తున్నాయి.

### సైబర్ నేరాల ముప్పు

పిల్లల మొబైల్ వినియోగం కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాదు; కుటుంబాల సైబర్ భద్రతకు కూడా సవాలుగా మారుతోంది. చాలా మంది పిల్లలు తల్లిదండ్రుల ఫోన్లనే ఉపయోగిస్తున్నారు. అదే ఫోన్లలో బ్యాంకింగ్ యాప్‌లు, యూపీఐ సేవలు, వ్యక్తిగత ఫొటోలు, అధికారిక ఇ-మెయిళ్లు, పాస్‌వర్డ్‌లు ఉంటాయి. సైబర్ నేరగాళ్లు "ఉచిత డైమండ్స్", "కొత్త స్కిన్", "ప్రత్యేక రివార్డ్" వంటి పేర్లతో నకిలీ లింక్‌లు పంపి పిల్లలను మోసం చేస్తున్నారు. వారు అమాయకంగా వాటిపై క్లిక్ చేయగానే మాల్వేర్ ఫోన్‌లోకి ప్రవేశించి వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించే ప్రమాదం ఉంది. ఒక్క నిర్లక్ష్యం కుటుంబ ఆర్థిక భద్రతను కూడా ప్రమాదంలో పడేయగలదు.

### బాధ్యత తల్లిదండ్రులదే కాదు

చాలా సందర్భాల్లో పిల్లల మొబైల్ వినియోగానికి తల్లిదండ్రులే అనుకోకుండా కారణమవుతున్నారు. చిన్న పిల్లలు ఏడుస్తున్నారని ఫోన్ ఇవ్వడం, తాము పనిలో బిజీగా ఉండటంతో వారిని స్క్రీన్‌కు అలవాటు చేయడం, కుటుంబ సభ్యులంతా తమ తమ ఫోన్లలో మునిగిపోవడం వంటి పరిస్థితులు పిల్లల్లో అదే ప్రవర్తనను పెంపొందిస్తున్నాయి. పిల్లలు చెప్పిన దానికంటే చూసిన దానినే ఎక్కువగా అనుకరిస్తారు. కాబట్టి పెద్దలు ముందుగా డిజిటల్ క్రమశిక్షణ పాటించాలి.

### పాఠశాలల పాత్ర కూడా కీలకం

డిజిటల్ వ్యసనాన్ని ఎదుర్కోవడంలో విద్యాసంస్థల పాత్ర కూడా ఎంతో ముఖ్యమైనది. విద్యార్థులకు సైబర్ భద్రత, డిజిటల్ వినియోగంలో జాగ్రత్తలు, స్క్రీన్ టైమ్ నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. క్రీడలు, కళలు, పుస్తక పఠనం, సృజనాత్మక కార్యక్రమాలకు ప్రాధాన్యం పెంచాలి. ప్రతి విద్యార్థి మానసిక ఆరోగ్యాన్ని పర్యవేక్షించే కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

### ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు

ప్రపంచంలోని కొన్ని దేశాలు ఇప్పటికే పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయి. భారతదేశంలో కూడా బాలల డిజిటల్ భద్రతపై మరింత సమగ్ర విధానం అవసరం. మైనర్ల కోసం గేమింగ్ సమయ పరిమితులు, పిల్లలను లక్ష్యంగా చేసుకునే డిజిటల్ ప్రకటనలపై నియంత్రణ, వయస్సు ధృవీకరణ వ్యవస్థలు, సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. పిల్లల కోసం రూపొందించే యాప్‌లు నైతిక ప్రమాణాలను పాటిస్తున్నాయా లేదా అనే అంశంపై పర్యవేక్షణ మరింత బలోపేతం కావాలి.

### బాల్యాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఇదే

పరిష్కారం సాంకేతికతను పూర్తిగా దూరం చేయడం కాదు; బాధ్యతాయుతమైన వినియోగాన్ని అలవాటు చేయడమే. కుటుంబంలో ప్రతిరోజూ కొంత సమయాన్ని "స్క్రీన్-ఫ్రీ టైమ్"గా కేటాయించాలి. భోజనం చేసే సమయంలో, నిద్రకు ముందు మొబైల్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలి. వారంలో ఒకరోజు "నో గ్యాడ్జెట్ డే" పాటించాలి. పిల్లలను ఈత, సైక్లింగ్, క్రీడలు, సంగీతం, చిత్రలేఖనం, పుస్తక పఠనం వంటి సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లించాలి. పేరెంటల్ కంట్రోల్స్, బలమైన పాస్‌వర్డ్‌లు, బయోమెట్రిక్ భద్రత వంటి చర్యలను తప్పనిసరిగా అమలు చేయాలి. పిల్లల బాల్యం అల్గారిథమ్‌లకు బందీగా మారుతుంటే చూస్తూ ఊరుకోవడం సమాజంగా మన వైఫల్యమే అవుతుంది. నేటి బాలల మానసిక ఆరోగ్యం, సృజనాత్మకత, సామాజిక విలువలను కాపాడుకోవడం అంటే రేపటి దేశ భవిష్యత్తును కాపాడుకోవడమే. ఈ బాధ్యత తల్లిదండ్రులదే కాదు; ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు, సమాజం మొత్తం కలిసి నిర్వర్తించాల్సిన బాధ్యత. సాంకేతికత మనిషికి సేవ చేయాలి కానీ, బాల్యాన్ని శాసించే స్థాయికి చేరకూడదు. ఆరోగ్యకరమైన బాల్యం, చైతన్యవంతమైన యువత, బలమైన భారత నిర్మాణానికి డిజిటల్ క్రమశిక్షణే తొలి అడుగు.

## సంపాదకీయం

# సమానత్వమే జగన్నాథుని మంత్రం



శ్రీ జగన్నాథుడి ప్రార్థనలు, కీర్తనలు చిన్ననాటి నుంచి నా జ్ఞాపకాల్లో పదిలమై ఉన్నాయి. పాఠశాలలో, కళాశాలలో చదువుకొనేటప్పుడు మహాప్రభు జగన్నాథుని భజన గీతాలు పాడటం నాకు చాలా ఆనందాన్నిచ్చేది. మహాప్రభుకి చాలా సన్నిహితంగా ఉన్న అనుభూతి కలిగేది. నేనీ మధ్య భజనలు పాడటం లేదు కానీ, ప్రతి రోజూ ఆ మహాప్రభుని స్మరిస్తాను. భజనలోని ఓ నాలుగు పదాలైనా పలకని రోజుండదు. నిజానికి మహాప్రభు నాకు దగ్గరగా ఉన్నట్టు భావిస్తుంటాను. కష్ట సమయాల్లో ఆయన నాకు అండగా ఉన్నారు. ఈనాటికీ భక్త కవి మధుసూదనరావు రచించిన పాటను పాడుతూనే ఉంటాను. "అంతటా ఉండే ఓ మహాప్రభూ... నువ్వు రాత్రింబగళ్లు నా తోడే ఉన్నావు... ఈ జ్ఞాపకంతో నిన్ను ఎల్లప్పుడూ పూజిస్తాను... నా పూర్ణ హృదయంతో..." అని ఆ పాటకి అర్థం. లౌకిక విషయాలు అర్థం చేసుకొనే వయసు వచ్చేనాటికి మహాప్రభు జగన్నాథుని గొప్పదనాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించాను. మహాప్రభు జగన్నాథుని గురించి ఇంట్లో తరచూ మాట్లాడుకొనేవారు. మా గ్రామంలోనూ ఇలాంటి చర్చలే ఎక్కువగా జరుగుతుండేవి. నేను గ్రామ పాఠశాలలో చదువుతున్నప్పుడు భక్త సాల్బేగ్ రచించిన 'ఆహే నీల శైల' అనే ప్రార్థనను క్రమం తప్పకుండా పఠించేవారు. మహాప్రభు జగన్నాథుని గురించి మా టీచర్ అనేక విషయాలు చెబుతూ ఉండేవారు. "పూరీలో పెద్ద ఆలయం ఉంది. అంతటి గొప్ప ఆలయం మరొకటి లేదు! ఆ ఆలయంలో తన చెల్లెలు సుభద్ర, సోదరుడు బలభద్రునితో కలసి మహాప్రభు పూజలందుకుంటారు. మహాప్రభు జగన్నాథుడు నల్లని రంగులో, గుండ్రని కళ్లతో ఉంటారు. సుభద్ర పసుపు రంగులో, బలభద్రుడు వెన్నెల్లో వికసించిన పుష్పంలా శ్వేతవర్ణంలో ఉంటారు. ఒక్కసారి ఆ మూర్తులను చూస్తే.. ఎప్పటికీ మరచిపోం" అని చెప్పేవారు. జగన్నాథుడే మహాప్రభువనీ, ఆయన ప్రసాదమే మహాప్రసాదమని కూడా మా టీచర్ చెప్పేవారు. ఆయన ఆలయమే 'బడ దేవుళ' లేదా పెద్ద ఆలయం. ఆయన మార్గమే బడ దాండ. అంటే ఉత్కృష్ట మార్గం. ఆయన సముద్రమే మహోదధి లేదా గొప్ప మహాసముద్రం. మయూర్భంజ్ జిల్లాలోని మా ఊరు ఉపర్‌బేడా నుంచి పురుషోత్తమ క్షేత్రం- పూరీ చాలా దూరంలో ఉంటుంది. మరి పూరీని సందర్శించే అవకాశం నాకెలా వస్తుంది? నేను పెద్దయ్యాక, భువనేశ్వర్‌కి వెళ్లాను. అక్కడ బాలికల ఉన్నత పాఠశాల యూనిట్--2లో చేరాను. అక్కడే వసతిగృహంలో ఉండేదాన్ని. అక్కడ ఉన్నప్పుడే పూరీ, భువనేశ్వర్, కోణార్క్ సందర్శించే అవకాశం నాకు లభించింది. మొదటిసారి మహాప్రభును దర్శించుకున్న జ్ఞాపకం ఇప్పటికీ నా మదిలో స్పష్టంగా ఉంది. ఎంత అద్భుతమైన ఆలయం! ఎంత తేజోవంతమైన దేవతా మూర్తులు! వాటిని మరచిపోగలమా? ఎవరైనా మహాప్రభు జగన్నాథుని రథయాత్రను మరచిపోగలరా? శ్రీ క్షేత్రలో ఏడాదిలోని పన్నెండు నెలల్లో పదమూడు ఉత్సవాలు జరుగుతాయి. కానీ రథయాత్ర వైభవం మాత్రం అద్వితీయం. మహాప్రభు దర్శనం కోసం ఏడాది పొడవునా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. కానీ ఏడాదికోసారి మహాప్రభువే ఆలయాన్ని వదలి విశాల పథంలో గుండిచా ఆలయానికి చేరుకొని భక్తులకు దర్శనమిస్తారు. మూడు అద్భుతమైన రథాలపై.. చక్రరాజ సుదర్శనునితో పాటు.. ముగ్గురు దేవతామూర్తులు గుండిచా ఆలయానికి చేరుకుంటారు. అక్కడే ఏడు రోజులు ఉండి, ఆ తర్వాత తిరుగు ప్రయాణమవుతారు. అత్యంత వైభవోపేతమైన ఈ మహాప్రభు ఉత్సవానికి సాటి లేదు. చిన్నతనం నుంచి మహాప్రభు జగన్నాథుని భక్తురాలిని. నేను అత్యంత భక్తిభావంతో కొలిచే దైవం ఆయన. నా జీవితంలో ఒడిదొడుకులను నిర్ణయించేది ఆయనే. నా సుఖదుఃఖాలకు ఆయనే మూలం. నా జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాను. ఆ సమస్యలన్నింటి నుంచి మహాప్రభు నన్ను బయటకు తీసుకొచ్చారు. ఎంతైనా నేను ఆయన బిడ్డనే కదా. భారత రాష్ట్రపతి పదవికి నన్ను అభ్యర్థిగా ప్రకటించినప్పుడు.. నేను భక్తిపూర్వకంగా మహాప్రభుని తలచుకున్నాను. 'నన్ను ఇంత పెద్ద స్థాయికి తీసుకెళుతున్నావు. నన్ను ముందుకు నడిపించు. ఎప్పుడూ నాతోనే ఉండు' అని ప్రార్థించాను. ఆయన నా మొర ఆలకించారు. నా ప్రార్థనకు ఆయన ఎప్పుడూ స్పందిస్తారు. నేను రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తరుణంలో.. రథయాత్ర ఉత్సవం జరిగింది. నేను అప్పుడు ఢిల్లీలోనే ఉండాల్సి వచ్చింది. పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. రథయాత్ర రోజు ఉదయమే నేను ఢిల్లీలోని హౌజ్‌ఖాస్‌లో ఉన్న శ్రీ జగన్నాథుని ఆలయానికి వెళ్లాను. మహాప్రభు దర్శనం చేసుకున్నాను. నా హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఆయన నాపై తన ఆశీస్సులను కురిపించారు. పూర్తి విశ్వాసంతో నేను నామినేషన్ దాఖలు చేశాను. అత్యంత ఉత్సాహంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. 2022 జూలై 25న రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయడానికి పార్లమెంట్ సెంట్రల్ హాలుకి వెళుతూ... దారిలో నేను మహాప్రభు జగన్నాథుని స్మరిస్తూనే ఉన్నాను. ఆయన ఆశీస్సులతో, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రాష్ట్రపతిగా నేను మొదటిసారి ప్రసంగించినప్పుడు ఆయన నాతోనే ఉన్నట్టు అనిపించింది. అయినప్పటికీ.. మహాప్రభు దర్శనం కోసం నా హృదయం పరితపించింది. రోజులు గడచిపోతున్నాయి కానీ పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. ఆయన అనుమతిస్తేనే తప్ప ఎవరికైనా ఆయన దర్శనం ఎలా లభిస్తుందని నాకు అనిపించింది. 'మహాప్రభూ! నేనేదైనా తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి. దయచేసి నన్ను పూరీకి పిలిచి.. మీ దర్శన భాగ్యం ఇవ్వండి' అని మౌనంగా ప్రార్థించాను. భావాలకు లేదా భావోద్వేగాలకు కూడా ఆయనే మహాప్రభు. నా ఆలోచనలను ఆయన ఎలా అర్థం చేసుకోకుండా ఉంటారు? అనతి కాలంలోనే పూరీ పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు 2022 నవంబర్ 10. పూరీకి చేరుకున్న తర్వాత వాహన శ్రేణి శ్రీ మందిర్ దిశగా ముందుకు వెళుతోంది. పూరీలోని బడ దాండ వద్దకు చేరుకోగానే అనిర్వచనీయమైన అనుభూతి నన్ను ముంచెత్తింది. బడ దాండ శ్రీ జగన్నాథునిది. ఇక్కడ ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం ఉందా? అన్ని పుణ్యక్షేత్రాల్లోనూ క్షేత్ర రాజంగా పూరీ ప్రసిద్ధి చెందింది. దేవుళ్లకే దేవుడు మహాప్రభు. ఎలాంటి ఆలోచనలు లేకుండా నా కారుని ఆపించాను. నా కారు ఆగగానే వెనుక వస్తున్న కార్లనీ కూడా ఆగిపోయాయి. ఏం జరుగుతుందో మిగిలిన వారికి అర్థమయ్యేలోపే.. చెప్పులు లేకుండా బడ దాండపై నడవడం మొదలుపెట్టాను. అక్కడికి శ్రీ మందిర్ రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆలయ శిఖరం మీద ఉన్న నీల చక్రం, పతిత పావన ధ్వజం మీదే నా దృష్టిని సారించి ముందుకు సాగాను. ముందుకు నడుస్తూనే.. రోడ్డుకిరువైపులా ఉన్న బాలలు, మహిళలు, యువత, పెద్దలకు నమస్కరిస్తూనే ఉన్నాను. కానీ నా దృష్టి మాత్రం మహాప్రభుమీదే ఉంది. ఆలయ సింహద్వారానికి చేరుకొనే సరికి.. నేను స్థిమితంగా ఉండలేకపోయాను. అప్పటికే నన్ను నేను మరచిపోయాను. బడ దాండ మీద దుమ్ములోనే సాష్టాంగ నమస్కారం చేసి... ఆ మహాప్రభుకి నా ప్రణామాలు అర్పించాను. ఆ తర్వాత నేను గుడిలోకి వెళ్లాను. గర్భగుడికి చేరుకొని నలుగురు దేవతామూర్తులను దర్శనం చేసుకుని, దైవికానందంతో ఉప్పొంగిపోయాను. ఈ విశ్వానికి రక్షకుడు మహాప్రభువే. అందరూ వదిలేసిన వారికి కూడా ఆయనే రక్షకుడు. లోకంలోని జనుల కష్టాలను తీర్చేందుకు ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటారు. అందుకే ఆయన విశాలమైన గుండ్రటి నేత్రాలు ఎప్పుడూ రెప్ప వాల్చవు. ఆయనకి పెద్దాచిన్నా తారతమ్యం లేదు. ఆయన దృష్టిలో అందరూ సమానులే. సమానత్వమే ఆయన మంత్రం. ఆయన దీవెనలతోనే.. సమాజంలోని ప్రతి వర్గానికీ సేవ చేసేందుకు నన్ను నేను అంకితం చేసుకున్నాను. గుండ్రని కన్నులతో ఉన్న మహాప్రభు జగన్నాథుని చూస్తూ.. 'ఓ మహాబాహూ! ప్రజలకు సేవ చేయాలనే నా అంకితభావం కొనసాగేలా ఆశీర్వదించు. ఓ కృపానిధీ! నా దేశాన్ని, ఈ ప్రపంచాన్ని రక్షించు' అని చేతులు జోడించి ప్రార్థించాను. ఇలా చెబుతూ భక్తిభావంలో లీనమైపోయాను.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# హర్యానాలో చారిత్రక ఘట్టం..




**న్యూ ఢిల్లీ :** భారతీయ రైల్వే చరిత్రలో చారిత్రాత్మక ఘట్టానికి హర్యానాలోని జింద్ రైల్వే స్టేషన్ వేదిక అయింది. హైడ్రోజన్ రైలు రాకతో పర్యావరణ పరిరక్షణ, హరిత ఇంధన విప్లవంలో ఒక సరికొత్త అధ్యాయం లిఖించబడింది. హర్యానాలోని జింద్ రైల్వే స్టేషన్ నుండి సోనిపట్ వరకు నడవనున్న దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జెండా ఊపి ప్రారంభించారు. శూన్య ఉద్గారాలు , కాలుష్య రహిత ప్రజా రవాణాయే లక్ష్యంగా భారత రైల్వే ఈ సరికొత్త టెక్నాలజీని పట్టాలెక్కించింది. ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవంలో హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, కేంద్ర రైల్వే శాఖ అధికారులు జింద్ స్టేషన్ నుండి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. హైడ్రోజన్ ఇంధన కణాల ద్వారా నడిచే ఈ రైలు పూర్తిగా పర్యావరణ అనుకూలమైనది. ఇది పొగకు బదులుగా కేవలం నీటి ఆవిరి , వేడిని మాత్రమే వదులుతుంది. తద్వారా కార్బన్ ఉద్గారాలను పూర్తిగా అరికట్టవచ్చు. 'మేక్ ఇన్ ఇండియా' చొరవలో భాగంగా దేశీయంగానే ఈ హైడ్రోజన్ రైలు సాంకేతికతను అభివృద్ధి చేశారు. రాబోయే రోజుల్లో దేశంలోని వివిధ పర్యాటక మరియు చారిత్రాత్మక నగరాల మధ్య ఇటువంటి మరిన్ని పర్యావరణ అనుకూల హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది.

**డీజిల్, విద్యుత్ వినియోగం తగ్గిస్తాం..**

భవిష్యత్ అంతా హైడ్రోజన్‌దే అని రైల్వేలో డీజిల్, విద్యుత్ వినియోగం తగ్గిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలు ను శుక్రవారం హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో నరేంద్రమోదీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన పీఎం.. పర్యావరణహిత ప్రాధాన్యంలో భాగంగానే హైడ్రోజన్ రైలు తీసుకువచ్చామన్నారు. జర్మనీ, చైనా, జపాన్, అమెరికా దేశాల తర్వాత భారత్‌లోనే హైడ్రోజన్ రైలు ఉందని చెప్పారు. ప్రపంచంలోనే అతి పెద్ద హైడ్రోజన్ రైలు ఇదని, ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైళ్లలో 2-4 కోచ్‌లు మాత్రమే ఉంటాయని కానీ సింద్-సోనిపట్ రైల్లో 10 కోచ్ లు ఉన్నాయన్నారు.

**రైల్వే ట్రాక్‌పై సరికొత్త విప్లవం:**

పర్యావరణహిత ప్రాధాన్యంలో భాగంగానే హైడ్రోజన్ రైలు తీసుకువచ్చామని రైల్వే రూపురేఖలు మార్చడంలో ఇది కీలకమైన అడుగు అన్నారు. హైడ్రోజన్ రైలుతో హర్యాణా పేరు చిరస్థాయిలో నిలుస్తుందన్నారు. రూ. 14 వేల కోట్లతో రైల్వే, రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దేశ ప్రజలంతా స్వచ్ఛతా మంత్రం పఠిద్దామని పిలుపునిచ్చారు. భవిష్యత్ లో మరిన్ని హైడ్రోజన్ రైళ్లు వస్తా-యని హైడ్రోజన్ రైలు.. రైల్వే ట్రాక్ పై సరికొత్త విప్లవానికి నాంది అన్నారు 2014 కంటే ముందు యుద్ధం వస్తే ఇంధన కొరతతో రైళ్లు ఆగిపోయేవి. ఏ సంక్షోభానికైనా భారత్ దగ్గర సమాధానం ఉంటుందన్నారు. 2014 వరకు రైల్వేలో విద్యుదీకరణ 30 శాతం మాత్రమే ఉందని మేం వచ్చాక 12 ఏళ్లలో రైల్వేలో విద్యుదీకరణ 99 శాతానికి పెంచామన్నారు. హార్మూజ్ లో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని హూర్మూజ్ జలసంధి యుద్ధ క్షేత్రంగా మారిందన్నారు. ఇంధన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. డీజిల్ రాకుంటే రైళ్లు ఎలా నడుస్తాయి? ఎలాంటి సంక్షోభాలు వచ్చినా భారత్ అడుగులు అభివృద్ధి వైపే అని మోడీ దృష్టి ఎప్పుడూ సమస్యల పరిష్కారం వైపే అని చెప్పారు. భారత్ లో ఒలింపిక్స్ జరిగే సమయం ఎంతో దూరం లేదని ఒలింపిక్స్ పోటీలకు తగినట్లు మన క్రీడాకారులను తీర్చిదిద్దుతామన్నారు.



# కలెక్టర్, ఎస్పీకి కీలక ఆదేశాలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ సైదాబాద్‌లోని సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌లో మతబోధనలు చేస్తున్నట్టు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. స్కూల్ లో రెండవ తరగతి చదువుతున్న విద్యార్థికి డైరీలో ఖురాన్ చదవాలంటూ హోం వర్క్ ఇవ్వడంతో అతడి తల్లిదండ్రులు స్కూల్ కు వెళ్లి యాజమాన్యాన్ని నిలదీశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోనను రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే పలువురు బీజేపీ నాయకులు స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయగా.. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదైంది. బీఎస్ఎస్ 299, జువైనల్ సెక్షన్ 75కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రిన్సిపాల్, యాజమాన్యంతో పాటు డైరీలో ఖురాన్ హోం వర్క్ గా పేర్కొన్న టీచర్ పైనా కేసు నమోదైంది. మరోవైపు ఈ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సైతం సీరియస్ అయ్యింది. ఇది మానవ హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుందని తెలిపింది. మతబోధనలపై స్కూల్ వివరణ ఇవ్వాలని కోరింది. హైదరాబాద్ సీపీ, కలెక్టర్, డీఈవోకు నోటీసులు ఇచ్చి రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

# నర్సింగ్..దైవత్వం కూడిన ఉన్నతమైన వృత్తి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బంజారాహిల్స్ సేవాలాల్ బంజారా భవన్ లో ఈఎస్ఐలో నూతనంగా ఎంపికైన 247 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు మాట్లాడుతూ..ఈరోజు తెలంగాణ ప్రభుత్వ బీమా వైద్య సేవల శాఖలో 247 మంది నూతన నర్సింగ్ అధికారులకు నియామక పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. దాదాపు 15 సంవత్సరాల తర్వాత ఈ శాఖలో ఇంత పెద్ద ఎత్తున నర్సింగ్ నియామకాలు జరగడం రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వైద్య రంగంపై ఉన్న నిబద్ధతకు నిదర్శనం. నర్సింగ్ అనేది కేవలం ఒక ఉద్యోగం కాదు... బాధలో ఉన్న మనిషికి భరోసా ఇచ్చే దైవసమానమైన సేవా వృత్తి. ఈ రోజు నియామక పత్రాలు అందుకుంటున్న ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక అభినందనలు. మీ సేవల ద్వారా లక్షలాది మంది రోగుల జీవితాల్లో ఆశ, ధైర్యం నింపే అవకాశం మీకు లభించింది. గత ప్రభుత్వ హయాంలో ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. ఈఎస్ఐ ఆసుపత్రులను ఆధునికీకరించడం, అవ-సరమైన సిబ్బందిని నియమించడం, కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించడం వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ప్రజా ప్రభుత్వం ఆ పరిస్థితిని పూర్తిగా మార్చే దిశగా అడుగులు వేస్తోంది. గౌరవ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి గారు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ శాఖను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణను అమలు చేయడంతో పాటు, ఈఎస్ఐ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవల కోసం అవసరమైన చర్యలను వేగంగా తీసుకుంటున్నారు. ఈఎస్ఐ ఆసుపత్రుల్లో డయాలసిస్ యూనిట్లు, సీటీ స్కాన్ సౌకర్యాలు, బర్న్స్ యూనిట్లు, కార్డియాక్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తూ, ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. అదే సమయంలో సేవల నాణ్యతను మరింత పెంచేందుకు నర్సింగ్ సిబ్బందితో పాటు వైద్య సిబ్బందిని కూడా భారీగా నియమిస్తున్నాం. త్వరలోనే 120 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 6 మంది డెంటల్ సివిల్ సర్జన్లు, 99 మంది ఫార్మసిస్టులు, 34 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 54 మంది ఏఎన్ఎంలు తదితర పారామెడికల్ సిబ్బంది నియామకాల ప్రక్రియను కూడా పూర్తి చేస్తాం. ప్రజా ప్రభుత్వం ఆరోగ్యం, విద్య రంగాలను సంక్షేమ కార్యక్రమాలుగా మా-త్రమే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తుపై చేసే అత్యంత విలువైన పెట్టుబడిగా చూస్తోంది. ఆరోగ్యవంతమైన, విద్యావంతమైన మానవ వనరులే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి నిజమైన బలమని మేము విశ్వసిస్తున్నాం. అందుకే ఈ రెండు రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, అవసరమైన నిధులను ఎలాంటి సందేహం లేకుండా విడుదల చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా సనత్‌నగర్, ఎల్‌బీనగర్, అల్వాల్, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నిమ్స్ విస్తరణ వంటి కీలక వైద్య మౌలిక వసతుల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నాం. రాష్ట్రంలో వైద్య సేవల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచడమే మా లక్ష్యం. వైద్య విద్య విస్తరణకు కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే కొత్త మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, పారామెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పిస్తున్నాం. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 76 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలకు నియామక పత్రాలు అందించింది. అదే సమయంలో స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, విదేశీ ఉపాధి అవకాశాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అదే సంకల్పంతో ప్రభుత్వ పా-ఠశాలల్లో చదివే 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, అలాగే రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా వంటి చారిత్రాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన వైద్యం, ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య, ప్రతి యువకుడికి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో వైద్య సిబ్బంది పాత్ర అత్యంత కీలకం. ఈ రోజు నియామక పత్రాలు అందుకుంటున్న మీ అందరికీ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు అంకితభావంతో సేవ చేయాలని కోరుకుంటున్నాను.

అదేవిధంగా, ఈరోజు మరో చారిత్రాత్మక నిర్ణయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా రక్షణ కల్పించే పథకాన్ని ప్రారంభించాం. కులం, మతం, వర్గం అనే తేడా లేకుండా రాష్ట్రంలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి ఈ బీమా వర్తించేలా ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి కుటుంబానికి ఈ భద్రత కల్పిస్తున్నందుకు నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా నియామక పత్రాలు అందుకుంటున్న 247 మంది నూతన నర్సింగ్ అధికారులకు, వారి కుటుంబ సభ్యులకు మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. మీ సేవలు లక్షలాది మంది కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడాలని ఆకాంక్షిస్తున్నాను. గౌరవ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి గారు కార్మికులు, ఈఎస్ఐ లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యుల అవసరాలను మానవీయ దృక్పథంతో గుర్తించి, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఈ శాఖను ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ శాఖ అభివృద్ధికి ఆయన చూపుతున్న చొరవను నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

ఈ శాఖ బలోపేతానికి మంత్రి గారు కోరిన ప్రతి అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుంది. అవసరమైన నిధులు, సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించడంలో ఆర్థిక శాఖ పూర్తి సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా నేను హామీ ఇస్తున్నాను. మరోసారి నియామక పత్రాలు అందుకున్న మీ అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ... ప్రజలకు అంకితభావంతో సేవ చేయాలని కోరుకుంటున్నాను.

# కాంగ్రెస్లో.. విభేదాలు

- అంతర్గత పరిస్థితులపై ఫోకస్
- మంత్రులతో మీనాక్షి వరుస భేటీలు
- 23 మంది సీనియర్ నేతలతోనూ చర్చలు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్లో సంస్థాగత మార్పులు జిల్లాల వారి రాజకీయ సమీకరణాలు, పార్టీ అంతర్గత పరిస్థితులపై అధిష్ఠానం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షినట రాజన్ రాష్ట్రంలోని కీలక నేతలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు మీనాక్షి నటరాజన్తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, జిల్లాల వారి సమన్వయం, అలాగే ఎస్ఐఆర్) అమలు తీరుపై చర్చించినట్లు సమాచారం. ఇటీవల డీసీసీ అధ్యక్షులతో జరిగిన సమావేశంలో కొందరు మంత్రుల పనితీరుపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో, పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలపై కూడా మీనాక్షి నటరాజన్ ఆరా తీసినట్లు తెలిసింది. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా 23 మంది సీనియర్ కాంగ్రెస్ నేతలకు అపాయింట్ మెంట్ ఇచ్చి వారి అభిప్రాయాలు, జిల్లాల రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై విడివిడిగా చర్చించారు. రానున్న స్థానిక సంస్థలతో పాటు భవిష్యత్ ఎన్ని కలను దృష్టిలో ఉంచుకుని పార్టీని మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్ల డంపై అధిష్ఠానం దృష్టి సారించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి...

# ఖాతాలు వెంటనే వెల్లడించాలి

**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** సుప్రీంకోర్టు ఆమోదించిన బీసీసీఐ, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ రాజ్యాంగంలోని రూల్ 37(2) ప్రకారం టీజీ20 లీగ్‌కు సంబంధించిన ఆడిట్ ఖాతాలు, ఆర్థిక నివేదికలు, పరిపాలనా రికార్డులను వెంటనే హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్‌లో బహిర్గతం చేయాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు హెచ్‌సీఏ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న సింగిల్ మెంబర్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ జస్టిస్ (రిటైర్డ్) పి. నవీన్ రావుకు వినతిపత్రం సమర్పించినట్లు ఒక ప్రకటన లో తెలిపారు. దాని ప్రతులను హెచ్‌సీఏ కార్యదర్శి, తాత్కాలిక అధ్యక్షుడు, తాత్కాలిక సీఈఓ, కోశాధికారి, జాయింట్ సెక్రటరీ, టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, ప్లేయర్స్ ప్రతినిధులకు పంపినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ.. రూల్ 37(2) ప్రకారం ప్రతి క్రికెట్ సంఘం తన ఆడిట్ చేసిన ఆర్థిక లెక్కలు, వార్షిక నివేదికలు, కీలక పరిపాలన పత్రాలు ప్రజలకు అందుబాటులో ఉంచడం తప్పనిసరి అయినప్పటికీ, టీజీ20 లీగ్ విషయంలో హెచ్‌సీఏ ఈ నిబంధనలను పాటించడం లేదని ఆరోపించారు. టీజీ20 లీగ్‌కు సంబంధించిన ఆడిట్ ఖాతాలు, బ్యాలెన్స్ షీట్లు, ఫ్రాంచైజీ, స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు, ఆదాయ వ్యయ వివరాలు, టెండర్లు, కొనుగోలు రికార్డులు, గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటుకు సంబంధించిన తీర్మానాలు, బీసీసీఐ అనుమతి పత్రాలను వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. టీసీఏ గతంలో లేవనెత్తిన ప్రశ్నలకు హెచ్‌సీఏ ఇప్పటివరకు సమాధానం ఇవ్వలేదని, రూల్స్ 28, 30 ప్రకారం అవ-సరమైన బీసీసీఐ అనుమతులు, హెచ్‌సీఏ జనరల్ బాడీ, అపెక్స్ కౌన్సిల్ ఆమోదాలకు సంబంధించిన పత్రాలను కూడా వెల్లడించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రూల్ 31 ప్రకారం చర్యలు తీసుకోవాలని టీసీఏ ఇప్పటికే కోరినట్లు తెలిపారు. హెచ్‌సీఏ ప్రకటించిన వివరాల ప్రకారం టీజీ20 లీగ్ కోట్ల రూపాయల నష్టాల్లో కొనసాగుతున్నప్పటికీ, ఆర్థిక లావాదేవీల వివరాలను ప్రజలకు వెల్లడించక పోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సీఐడీ, ఏసీబీ, ఈడీ వంటి సంస్థలు హెచ్‌సీఏ వ్యవహారాలపై దర్యాప్తు జరుపుతున్న నేపథ్యంలో పూర్తి ఆర్థిక పారదర్శకత అవ-సరమని అభిప్రాయపడ్డారు. అలాగే 2021లో బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ హెచ్‌సీఏ, టీసీఏ కలిసి హైదరాబాద్ వెలుపల క్రికెట్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ, టీజీ 20 నిర్వహణలో టీసీఏకు ప్రాతినిధ్యం కల్పించలేదని

ధరం గురువారెడ్డి ఆరోపించారు. తెలంగాణ జిల్లాల పేర్లను ఉపయోగించుకుంటూనే గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన క్రికెటర్లకు సమాన అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. టీజీ20 లీగ్‌కు సంబంధించిన అన్ని ఆడిట్ ఖాతాలు, ఆర్థిక నివేదికలు, పరిపాలనా రికార్డులను వెంటనే హెచ్‌సీఏ వెబ్‌సైట్‌లో ప్రచురించేలా సింగిల్ మెంబర్ కమిటీ జోక్యం చేసుకోవాలని టీసీఏ విజ్ఞప్తి చేసింది. క్రికెట్ పరిపాలనలో పారదర్శకత తప్పనిసరి అని, రాజ్యాంగ నిబంధనల అమలు ప్రతి క్రికెట్ సంస్థ బాధ్యత అని గురువారెడ్డి స్పష్టం చేశారు.

# ఉద్యోగులంతా మన బిడ్డలే..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఉద్యోగుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారికంగా ప్రారంభించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సమక్షంలో జరిగిన ఈ వేడుకలో ఉద్యోగులకు నూతన హెల్త్ కార్డులను డిప్యూటీ సీఎం అందజేశారు.

**ఉద్యోగులంతా మన బిడ్డలే..**

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమం కోసం ఒక నూతన అధ్యాయం మొదలైందని ఆనందం వ్యక్తం చేశారు. 'గతంలో వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్నామని ఉద్యోగులు తమ బాధలను మాతో పంచుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులే అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారు. అందుకే ఉద్యోగులందరినీ మన బిడ్డలుగా భావించి, వారికి పూర్తి భరోసానిచ్చేలా ఈ అత్యుత్తమ ఆరోగ్య పథకానికి శ్రీకారం చుట్టాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేసింది' అని ఆయన పేర్కొన్నారు.

**నేటి నుంచే ఐడీ కార్డులు..**

ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ పథకం యొక్క పూర్తి వివరాలను వెల్లడించారు. ఉద్యోగుల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నేటి నుంచే ప్రతి ఉద్యోగికి, పెన్షనర్‌కు ప్రత్యేక హెల్త్ ఐడీలను జారీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నూతన పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 886 నెట్‌వర్క్ ఆసుపత్రులలో పూర్తిగా నగదు రహిత చికిత్సలు అందుబాటులో ఉంటాయి. దాదాపు 1,816 రకాల వైద్య చికిత్సలు, ఆపరేషన్లను ఈ పథకం పరిధిలోకి తీసుకొచ్చారు. వీటికోసం ఉద్యోగులు రూ-పాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఉద్యోగులకు మరింత చేరువగా వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 24 వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ సంజయ్ జాజు వెల్లడించారు.

# ఘట్‌కేసర్‌కు సీఎం రేవంత్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఘట్‌కేసర్‌లో పర్యటించబోతున్నారు. పర్యటనలో భాగంగా ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత అందెశ్రీ విగ్రహం, స్మృతివనం పనులకు భూమి పూజ చేయనున్నారు. గతేడాది నవంబర్ 10వ తేదిన అందెశ్రీ మరణించిన సంగతి తెలిసిందే. ఘట్ కేసర్ ఎన్ ఎఫ్‌సీ నగర్ లో పోలీస్ లాంఛనాలతో ప్రభుత్వం ఆయన అంత్యక్రియలను నిర్వహించింది. ఆ సమంయలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా అందెశ్రీ పాడెను మోశారు. అంత్యక్రియల అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని అందెశ్రీకి స్మృతి వనం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో రేపు అందెశ్రీ విగ్రహం, స్మృతివనం పనులకు భూమి పూజ చేయనున్నారు.

# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ నియోజకవర్గంలో తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న భూముల రీ-సర్వే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా మాడుగులపల్లి మండలంలోని గంద్రవాణిగూడెం గ్రామాన్ని ఎంపిక చేసి శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఆర్డీవో రమణారెడ్డి పాల్గొని భూముల రీ-సర్వే కార్యక్రమం ఉద్దేశ్యం, అమలు విధానం, ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ .. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో తెలంగాణ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. రీ-సర్వేతో భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ణయించబడటంతో పాటు భూ రికార్డులు ఆధునికీకరణ చెందుతాయని, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.రైతులు, భూ యజమానులు రీ-సర్వే ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని, అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు అవసరమైన భూ పత్రాలను అందించి సరైన వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రజల భూ హక్కులను పరిరక్షించడం, భవిష్యత్ తరాలకు వివాదరహిత భూ రికార్డులను అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆర్డీవో రమణారెడ్డి రీ-సర్వే నిర్వహణ విధానం, సాంకేతిక ప్రక్రియ, ప్రజలు పాటించాల్సిన సూచనలపై గ్రామస్తులకు వివరించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరోజ పావని, సర్పంచ్ బొబ్బలి కావ్య శ్రీను, చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు, భూ యజమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఎన్ జి కళాశాల డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ చివరి అవకాశం

**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం డిగ్రీలో చేరడానికి దోస్త్ ద్వారా ఆన్ లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఏ, బికామ్, బియ్యస్సీ, బిబిఏ, బిసిఏ కోర్సులలో కొన్ని సీట్లు మాత్రమే ఖాళీ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటిదాకా దోస్త్ ద్వారా దరఖాస్తు చేయనివారు, ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి ఇతర కోర్సులలో సీట్లు రాని ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈ నెల 20 నుంచి 26 మధ్యన ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్పెషల్ కేటగిరి అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 27న ఉంటుందని అన్నారు. ఈ నెల 30న సీట్ల అలాట్మెంట్ జరుగుతుందని తెలిపారు. ఈ నెల 30 నుంచే ఆన్ లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని పేర్కొన్నారు. ఈ స్పెషల్ ఫెజ్ లో సీట్లు పొందిన వారికి ఆగష్టు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇతర వివరాలకు 9989897566, 9985824737 నంబర్లను కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

# సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు సమర్థవంతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం, జనగామ మండలంలోని చీటకోడూరు పరిధిలోని పట్టణ నీటి శుద్ధి కేంద్రం (పంప్ హౌస్), చీటకోడూరు డ్యాంను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ పనితీరు, మోటార్ల సామర్థ్యం, నీటి శుద్ధి ప్రక్రియ, నీటి నిల్వ, పంపిణీ విధానం, తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.అలాగే 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ట్యాంకు వినియోగంతో తాగునీటి నిల్వ సామర్థ్యం పెరిగి ప్రజలకు నిరంతరాయంగా నీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.పంప్ హౌస్‌లో పనిచేస్తున్న మోటార్లకు అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టి, యంత్రాలు ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేసేలా చూడాలన్నారు. అవసరమైన విడిభాగాలను వెంటనే సమకూర్చి మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు.తాగునీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని పేర్కొన్న కలెక్టర్, నీటి శుద్ధి (ప్యూరిఫికేషన్) ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, క్లోరినేషన్, నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు సరఫరా చేసే ప్రతి చుక్క నీరు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.నీటి సరఫరా వ్యవస్థలో లీకేజీలు, పైప్‌లైన్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు వంటి సమస్యలను ముందుగానే గుర్తించి, వెంటనే పరిష్కరించాలని, పంపింగ్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పంప్ హౌస్ పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహిస్తూ, భద్రతా ప్రమాణాలను పాటించాలని, నీటి నిల్వ కేంద్రాల వద్ద పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. విద్యుత్ పరికరాలు, పంపింగ్ యంత్రాల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు.ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సమస్యలు వచ్చిన వెంటనే స్పందించి, పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, మిషన్ భగీరథ (ఇంట్రా) ఈఈ శ్రీకాంత్, మిషన్ భగీరథ (గ్రిడ్) సూర్య, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన దిగుబడులు సాధించాలి

**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** శుక్రవారం, జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని కళ్లెం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ సెమీ ఆర్గానిక్ విధానంలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేస్తున్న కూరగాయల తోటను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు.ఈ సందర్భంగా తోటలో పండిస్తున్న వివిధ రకాల కూరగాయలను పరిశీలించిన కలెక్టర్, సాగు విధానం, డ్రిప్ ఇరిగేషన్ వినియోగం, నీటి నిర్వహణ, సేంద్రియ ఎరువుల వినియోగం, పురుగు నివారణ చర్యలు, ఉత్పత్తి వ్యయం, దిగుబడి, మార్కెటింగ్ విధానం, తదితర వివరాలను రైతు శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు.శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులతో సాగు చేయడం వల్ల భూమి సారవంతత పెరగడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు డ్రిప్ ఇరిగేషన్ ఎంతో ఉపయోగకరమని, నీటి వృథాను నివారించడంతో పాటు సాగు ఖర్చులను కూడా తగ్గించవచ్చని తెలిపారు.కూరగాయల సాగులో శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని మరింత పెంచాలని, మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులను



వినియోగించాలని సూచించారు. ఉత్పత్తుల నాణ్యతను కాపాడుతూ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సాంకేతిక సూచనలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిల్లాలో ఇతర రైతులు కూడా ఇలాంటి ఆధునిక, నీటి పొదుపు సాగు విధానాలను అవలంబించి, అధిక ఆదాయం పొందేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, డీఆర్‌డీఓ భాస్కర్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ ఫ్లైఓవర్ అండర్‌గ్రౌండ్ సుందరీకరణ పనులు ప్రారంభం





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లైఓవర్ క్రింద అండర్‌గ్రౌండ్ సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న పార్క్ ప్రాంగణంలో నూతన పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శంకుస్థాపన,భూమిపూజ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డ పాల్గొని పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. ఫ్లైఓవర్ అండర్‌గ్రౌండ్ ప్రాంతాన్ని ప్రజలకు ఆహ్లాదకరమైన,పరిశుభ్రమైన విశ్రాంతి ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు సుందరీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు.పార్క్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం ఆధునిక సదుపాయాలతో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడం ఎంతో అవసరమని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.అలాగే పార్క్ ప్రాంగణంలో మహిళశక్తి క్యాంటిన్ తో పాటు పేద ప్రజలకు ఆకలి తీర్చేందుకు 5 రూపాయల భోజన క్యాంటిన్ కూడా ఏర్పాటు చేస్తునట్టు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీజ రెడ్డి,అధికారులు,కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# అక్రమ పిడిఎస్ బియ్యం పట్టివేత,కేసు నమోదు

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గురువారం రాత్రి 1:00 సమయంలో మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎదురుగా ఏడు కోట్ల తండాకు చెందిన ధీరావత్ అశోక్ కుమార్ ఇన్చార్జిగా నడిపిస్తున్న రేషన్ షాపులో అక్రమంగా బియ్యం ఒక కొత్త వాహనంలో తరలిస్తున్నారు అన్న సమాచారం రాగా వెంటనే పోలీస్ సిబ్బంది వెళ్లి పట్టుబడి చేశారు.సదరు రేషన్ డీలర్ అక్రమంగా రేషన్ కార్డుదారుల నుండి బియ్యం తక్కువ రేట్ కు కొని అట్టి బియ్యంను భువనగిరి ప్రాంతానికి చెందిన బాణావత్ సాయిభరత్ మరియు లావుడియా రవీందర్ లతో కుమ్మక్కై వారికి అమ్మి అక్రమ ధనార్ధన చేస్తున్నారని తెలిసినది.వెంటనే సివిల్ సప్లై అధికారులకు సమాచారం తెలిపి అక్కడ పంచనామా నిర్వహించి సుమారు 15 బస్తాల పిడిఎస్ వాహనంలో కలవి మరియు 58 బస్తాలు రేషన్ షాపులో అక్రమంగా నిలువ ఉంచినవి మొత్తం 36 1/2 క్వింటాల్ బియ్యం సీజ్ చేయనైనది..డిటి సివిల్ సప్లై రావుల సైదులు దరఖాస్తు పై అక్రమ రేషన్ తరలిస్తున్న ఇన్చార్జి రేషన్ డీలర్ పై మరియు అతని వద్ద పిడిఎఫ్ కొనుగోలు చేస్తున్న సాయిభారత్ మరియు రవీందర్ లపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.




## నకిలీ లోన్లతో సైబర్ మోసం గుట్టురట్టు ..

**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** నకిలీ ఆన్‌లైన్ లోన్ల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న ముఠాను ఆదిలాబాద్ రూరల్ పోలీసులు ఛేదించి ప్రధాన నిందితుడు తిల్కర్ ఆకాశ్ అలియాస్ తలారి ఆకాశ్ ను అరెస్ట్ చేశారు. నిందితుడు సోషల్ మీడియా,వాట్సాప్ ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని నమ్మించి ప్రాసెసింగ్ ఫీజు, సర్వీస్ ఛార్జీల పేరుతో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. దర్యాప్తులో ఇప్పటివరకు 30 మందికి పైగా బాధితులను ఇదే తరహాలో మోసం చేసినట్లు, నిందితుడిపై రాష్ట్ర వ్యాప్తంగా 11 సైబర్ క్రైమ్ ఫిర్యాదులు ఉన్నట్లు గుర్తించారు. కేసులో పోతాని వెంకట సాయి, గోవర్ధన్, అఖిల్, కమలాపురం కార్తీక్ పరారీలో ఉండగా,వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. నిందితుడి వద్ద నుంచి మొబైల్ ఫోన్, సిమ్ కార్డులు, డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే తక్షణ రుణాల ప్రకటనలను నమ్మవద్దని,సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.

# విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి





**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత అలవాటు చేయడం, పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడం అత్యంత ముఖ్యమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన శుక్రవారం జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న సివిల్ పనులు, నీటి సంపు, సెప్టిక్ ట్యాంకు, అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్త, మట్టి దిబ్బలు, సిమెంట్, ఇసుక, కంకర, కర్రలు, ఇనుప చువ్వలు ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే డోజర్ ఏర్పాటు చేసి మొత్తం ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని ఆదేశించారు. చెత్త కారణంగా పాములు, తేళ్లు వంటి విషజంతువులు సంచరించే ప్రమాదం ఉందని, బాత్రూములతో పాటు అన్ని ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ప్రవల్లిక, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రజిత, గ్రామ కార్యదర్శికి సూచించారు. గ్రామంలో పారిశుధ్య లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రెడ్డిని హెచ్చరించారు. గ్రామంలోని మురికి కాలువలను వెంటనే శుభ్రం చేయడంతో పాటు కేజీబీవీ, ప్రాథమిక పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన యూనిఫాంలు సరైన కొలతల్లో లేకపోవడంతో పలువురు విద్యార్థినులు వాటిని ధరించడం లేదని తెలుసుకుని, సంబంధిత ఏపీఎంను పిలిపించి యూనిఫాంలు కుట్టిన టైలర్‌ను రెండు మూడు రోజులు పాఠశాలలోనే ఉంచి, విద్యార్థినుల కొలతలకు అనుగుణంగా యూనిఫాంలను కుట్టించి అందించాలని ఆదేశించారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి, కంప్యూటర్ల వినియోగం, డిజిటల్ విద్య బోధనపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందాయా లేదా అని విద్యార్థినులను ప్రశ్నించారు. అంతకుముందు వద్దిపాముల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి యూనిఫాంలు, పుస్తకాలు, నోట్‌బుక్స్, కిట్లు, భోజన నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులు అన్నాన్ని వృథా చేయకుండా దాని విలువను అర్థం చేసుకునేలా అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ సురేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రజిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మిక తనిఖీ



**సఫిల్‌గూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఈరోజు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డా. కె. ఆనంద్ గారు సఫిల్‌గూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (UPHC)ను ఆకస్మికంగా సందర్శించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించారు.ఈ సందర్భంగా డా. ఆనంద్ గారు ఓపీ (OP) రిజిస్టర్, ప్రయోగశాల (ల్యాబ్) రిజిస్టర్‌లను పరిశీలించి నమోదులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఫార్మసీని తనిఖీ చేసి, మందుల నిల్వలు, బఫర్ స్టాక్ పరిస్థితిని పరిశీలించారు. ముఖ్యంగా గడువు సమీపిస్తున్న (Near Expiry) మందులను గుర్తించి, వాటి వినియోగం మరియు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు.మాతా–శిశు ఆరోగ్య (MCH) సేవలను మరింత మెరుగుపరచాలని, గర్భిణీల నమోదు, ప్రసవానంతర సేవలు, శిశు టీకాల కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.అదేవిధంగా క్షయవ్యాధి (TB) కేసులను గుర్తించడం, చికిత్సలో ఉన్న రోగులను నిరంతరం అనుసరించడం, వారికి అందజేయాల్సిన డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (DBT) ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నిర్మూలన లక్ష్య సాధనకు క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు.ఈ తనిఖీలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# లార్డ్స్ వన్డేనే రోహిత్‌కు చివరిదా?..

టీమిండియా మాజీ కెప్టెన్, 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ వన్డే రిటైర్మెంట్‌పై గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు క్రికెట్ వర్గాల్లో పెను సంచలనంగా మారాయి. లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్ జరగబోయే మూడో వన్డేనే రోహిత్ కెరీర్లో చివరి మ్యాచ్ కాబోతుందంటూ ప్రచారం జరుగుతుండటంతో అభిమానుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో భారత జట్టు మేనేజ్మెంట్ తొలిసారి ఈ వివాదంపై స్పందించింది. రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాను కోటక్ స్పందించారు. అయితే, ఆయన నేరుగా రిటైర్మెంట్ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా దాటవేసినప్పటికీ.. రోహిత్ ప్రస్తుత ఫామ్, జట్టులో అతని ప్రాధాన్యతపై కీలక వ్యాఖ్యలు చేశారు. "రోహిత్‌పై ఎలాంటి ఒత్తిడి లేదు. అతను ఇప్పటికీ భారత జట్టుకు అత్యంత కీలకమైన ఆటగాడు" అని కోటక్ స్పష్టం చేశారు.

**రెండు మ్యాచ్‌లలో విఫలమైతే తప్పా?**

ఇటీవల రోహిత్ శర్మ స్థానంలో యువ ఆటగాళ్లు ఇషాన్ కిషన్ లేదా యశస్వి జైస్వాల్‌ను ఓపెనర్లుగా జట్టులోకి తీసుకురావాలనే చర్చలు ఊపందుకున్నాయి. దీనిపై సీతాను కోటక్ స్పందిస్తూ.. వరుసగా రెండు వన్డేల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినంత మాత్రాన రోహిత్ లాంటి సీనియర్ క్లాస్ ప్లేయర్ ఆటను తక్కువ అంచనా వేయడం సరికాదని గట్టిగా సమర్థించారు. మరోవైపు 39 ఏళ్ల రోహిత్ శర్మ. 2027 వన్డే ప్రపంచకప్ ఆడాలనే బలమైన లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకోసమే తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి, దాదాపు 10 కిలోల బరువు కూడా తగ్గాడు. అయితే, భవిష్యత్ (2027 వరల్డ్ కప్) ప్రణాళికల్లో భాగంగా రోహిత్‌కు వన్డే జట్టులో స్థానం ఉండకపోవచ్చని బీసీసీఐ ఇప్పటికే హిట్‌మ్యాన్‌కు స్పష్టం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

# ఎలాంటి పోటీ లేకుండానే..



జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సెమీ ఫైనల్‌కు చేరుకుంది. టోక్యోలో శుక్రవారం జరగాల్సిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు జపాన్‌కు చెందిన నొజోమీ ఒకుహారా గాయం కారణంగా వైదొలిగింది. దీంతో ఎలాంటి పోటీ లేకుండానే సింధు సెమీ ఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది. ఈ సీజన్‌లో తొలి టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగిన ఆమె.. సెమీస్‌లో చైనా ప్రపంచ నాలుగో ర్యాంకర్, టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత చెన్ యూఫీతో తలపడనుంది. ఈ సీజన్‌లో సింధుకు ఇది మూడో సెమీఫైనల్. అంతకుముందు మలేషియా సూపర్-1000, ఆస్ట్రేలియా సూపర్-500 టోర్నీల్లోనూ సెమీస్‌కు అర్హత సాధించింది. 2023 డెన్మార్క్ ఓపెన్ తర్వాత తొలిసారి సూపర్-750 స్థాయి టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకోవడం విశేషం. సింధు-చెన్ యూఫీ మధ్య ఇప్పటివరకు 14 మ్యాచ్‌లు జరగగా.. చెన్ 8-6 ఆధిక్యంలో ఉంది. ముఖ్యంగా గత ఐదు వరుస మ్యాచ్‌ల్లో సింధు ఓటమిపాలైంది. ఈసారి విజయం సాధిస్తే ఆ పరాజయాల పరంపరకు తెరపడటమే కాకుండా దాదాపు మూడేళ్ల తర్వాత సూపర్-750 టోర్నీ ఫైనల్‌లోకి అడుగుపెట్టిన ఘనతను సొంతం చేసుకోనుంది. అంతకుముందు ప్రీక్వార్టర్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హాన్ యూ (చైనా)పై సింధు 21-16, 21-14 తేడాతో కేవలం 35 నిమిషాల్లోనే విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే.

# భారత్ ఆలౌట్.. ఇంగ్లాండ్ టార్గెట్ 234



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో వన్డే మ్యాచ్‌లో భారత జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఆశించిన స్థాయిలో భారీ స్కోరు చేయలేకపోయింది. ప్రత్యర్థి బౌలర్ల ధాటికి 44 ఓవర్లలోనే 233 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బ్యాటింగ్‌లో మిడిలార్డర్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ (65), శ్రేయస్ అయ్యర్ (66) అర్ధశతకాలతో రాణించి జట్టును ఆదుకున్నారు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (31), కెప్టెన్ రోహిత్ శర్మ (26) ఫర్వాలేదనిపించినప్పటికీ పెద్ద స్కోర్లుగా మలచలేకపోయారు. వీరితో పాటు మిగిలిన బ్యాటర్లు ఎవరూ క్రీజులో ఎక్కువసేపు నిలదొక్కుకోలేకపోవడంతో భారత్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్ అద్భుతంగా బౌలింగ్ చేసి చెరో 3 వికెట్లు పడగొట్టి భారత ఇన్నింగ్స్‌ను దెబ్బతీశారు. వీరికి తోడుగా సాకిబ్ మహమూద్ 2 వికెట్లు, సామ్ కరన్ మరియు విల్ జాక్స్ చెరో వికెట్ సాధించారు. దీంతో ఇంగ్లాండ్ విజయానికి భారత్ 234 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.



# టీమిండియా కోచ్ కీలక ప్రకటన

ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ మధ్య టీమిండియా మాజీ కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ భవిష్యత్తుపై ఊహాగానాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని భారత సెలెక్టర్లు యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని భావిస్తున్నారనే వార్తలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా యశస్వి జైస్వాల్‌కు దీర్ఘకాలిక అవకాశాలు కల్పించాలనే ఆలోచనలో సెలక్షన్ కమిటీ ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో లార్డ్స్‌లో జరగనున్న మూడో వన్డే రోహిత్ శర్మ అంతర్జాతీయ కెరీర్‌లో చివరి మ్యాచ్ కావొచ్చనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. అయితే, ఈ ఊహాగానాల మధ్య టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కీలక వ్యాఖ్యలు చేశారు. రోహిత్ శర్మపై జట్టు యాజమాన్యం నుంచి ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. రోహిత్ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు ఇటువంటి చర్చలను పట్టించుకోడని, ఒత్తిడిలో ఆడే వ్యక్తి కాదని ఆయన పేర్కొన్నారు. రెండో వన్డే అనంతరం మీడియాతో మాట్లాడిన కోటక్, "రోహిత్ శర్మ లాంటి గొప్ప ఆటగాడిపై ఎలాంటి ఒత్తిడి ఉండదు. అతను ఎంతో అనుభవం ఉన్న క్రికెటర్. మొదటి రెండు మ్యాచ్‌ల్లో పరుగులు చేయకపోవడం పెద్ద విషయం కాదు. అలాంటి ఆటగాళ్లు ఒక్క ఇన్నింగ్స్‌తోనే విమర్శలకు సమాధానం చెప్పగలరు" అని అన్నారు. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి రెండు వన్డేల్లో రోహిత్ ఆశించిన స్థాయిలో రాణించలేదు. తొలి మ్యాచ్‌లో 11 పరుగులు మాత్రమే చేసిన ఆయన, కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో 47 బంతుల్లో 26 పరుగులు చేసి విల్ జాక్స్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో ఆయన ఫామ్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిని పేలవ ఫామ్‌గా అభివర్ణించడం సరైంది కాదని కోటక్ అభిప్రాయపడ్డారు. "కొన్నిసార్లు బ్యాట్స్‌మెన్‌కు ఆరంభంలో తాము కోరుకున్న లయ దొరకదు. అంత మాత్రాన వారు ఫామ్ కోల్పోయారని చెప్పలేం. కార్డిఫ్ పిచ్ స్వభావం కూడా భిన్నంగా ఉంది. డబుల్ బౌన్స్ రావడంతో రోహిత్ తనకు ఇష్టమైన షాట్లు ఆడలేకపోయాడు. అది అతని సామర్థ్యాన్ని ప్రశ్నించే పరిస్థితి కాదు" అని కోటక్ వివరించారు. ఇక లార్డ్స్‌లో జరిగే నిర్ణయాత్మక మూడో వన్డేపై కూడా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "రోహిత్ శర్మ ఎప్పుడు కావాలంటే అప్పుడు పెద్ద ఇన్నింగ్స్ ఆడగల సామర్థ్యం ఉన్న ఆటగాడు. నా అనుభవంలో ఇలాంటి సందర్భాల్లో ఎంతో మంది బ్యాట్స్‌మెన్ తిరిగి బలంగా పుంజుకోవడం చూశాను. లార్డ్స్‌లో మీరు పూర్తిగా భిన్నమైన రోహిత్ శర్మను చూడవచ్చు" అని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, రోహిత్ భవిష్యత్తుపై సెలెక్టర్ల వైఖరితో ఆయన అసంతృప్తిగా ఉన్నారని, ఈ అంశంపై బీసీసీఐ అధికారులతో చర్చించినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు బీసీసీఐ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో లార్డ్స్‌లో జరిగే మూడో వన్డే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఒకవైపు రిటైర్మెంట్ ఊహాగానాలు, మరోవైపు ఫామ్‌పై విమర్శలు కొనసాగుతున్న వేళ, రోహిత్ శర్మ ఒక భారీ ఇన్నింగ్స్ ఆడితే అన్ని చర్చలకు బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చినట్లవుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.


# బిజినెస్



# భారత్-యూకే వాణిజ్య ఒప్పందానికి శుభారంభం

భారత్, బ్రిటన్ (యూకే) మధ్య చారిత్రాత్మక 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం' (సీఈటీఏ) బుధవారం నుంచి అధికారికంగా అమల్లోకి రావడం దేశీ వాణిజ్య రంగానికి సరికొత్త మైలురాయిగా నిలిచింది. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అమల్లోకి వచ్చిన మొదటి రోజే భారత్ నుంచి 140 మిలియన్ డాలర్ల(రూ. 1,350 కోట్ల) విలువైన 50 సరుకుల రవాణా యూకేకు విజయవంతంగా జరిగిందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ సరికొత్త అధ్యాయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందిస్తూ, ఈ ఒప్పందం మన రైతులు, పారిశ్రామికవేత్తలు, చిన్న-మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) సరికొత్త ఊపునిస్తూ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల టెక్స్‌టైల్స్, చేతివృత్తులు, ఇంజనీరింగ్, సముద్ర ఆహార ఉత్పత్తులతో పాటు రత్నాలు, ఆభరణాల రంగానికి బ్రిటన్ మార్కెట్లో 'జీరో టాక్స్' ప్రవేశం లభించింది. మొదటి రోజే మన ఎగుమతిదారులు దాదాపు 10 మిలియన్ డాలర్ల(రూ. 96 కోట్ల) విలువైన బంగారు, వజ్రాల ఆభరణాలను బ్రిటన్‌కు పంపగా, రాబోయే మూడేళ్లలో ఈ ఎగుమతులు 2.5 బిలియన్ డాలర్ల(రూ. 24 వేల కోట్ల)కు చేరుకుంటాయని పరిశ్రమల మండలి ధీమాగా వ్యక్తం చేసింది. కస్టమ్స్ క్లియరెన్స్, డిజిటల్ సర్టిఫికెట్ల జారీ పరంగా మొదటి రోజు నుంచే ఎగుమతిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత సులభతరమైన ఏర్పాట్లు చేసినట్లు వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు.

# అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్



రుణాలను చెల్లించకుండా ఎగ్గొట్టే డిఫాల్టర్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రుణ వసూలు ప్రక్రియలో భాగంగా బ్యాంకులు స్వాధీనం చేసుకున్న స్థిరాస్తులను తిరిగి అదే రుణగ్రహీతకు లేదా అతనికి సంబంధించిన వ్యక్తులు, సంస్థలకు విక్రయించకూడదని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనలు 2026 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

**ఎందుకు ఈ నిర్ణయం?**

సాధారణంగా బ్యాంకులు రుణాలివ్వడం తమ ప్రధాన పనిగా చెప్పొచ్చు. అయితే, రుణం నిరర్థక ఆస్తి గా మారినప్పుడు, చట్టపరమైన లేదా ఒప్పందపరమైన చర్యల ద్వారా తనఖా పెట్టిన ఆస్తులను స్వాధీనం చేసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి ఆస్తుల నిర్వహణపై స్పష్టత తీసుకురావడానికే ఆర్‌బీఐ ఈ మార్గదర్శకాలను విడుదల చేసింది.

**ఏడు సంవత్సరాల్లోపు విక్రయం తప్పనిసరి**

కొత్త నిబంధనల ప్రకారం, బ్యాంకులు స్వా-ధీనం చేసుకున్న ఆర్థికేతర ఆస్తులను తమ అంతర్గత విధానంలో పేర్కొన్న గడువులో, గరిష్ఠంగా ఏడు సంవత్సరాల్లోపు విక్రయించాలి. అలాగే వీలైనంత త్వరగా బహిరంగ వేలం ద్వారా వాటిని అమ్మేందుకు ప్రయత్నించాలని ఆర్‌బీఐ సూచించింది.

**డిఫాల్టర్లకు రెండో అవకాశం లేదు**

కొత్త నిబంధనల ముసాయిదాపై అభిప్రా-యాలు కోరిన సమయంలో, కొందరు రుణగ్రహీతలు తమ స్వాధీనం చేసుకున్న ఆస్తులను తిరిగి కొనుగోలు చేసే అవకాశం కల్పించాలని సూచించారు. అయితే, దీనిని ఆర్‌బీఐ తిరస్కరించింది. ఇలా అనుమతిస్తే నైతిక ప్రమాదం ఏర్పడుతుందని, రుణ క్రమశిక్షణ దెబ్బతింటుందని పేర్కొంది. రుణాలు చెల్లించని వారికి ప్రత్యేక ప్రయోజనం కల్పించడం సరైంది కాదని కేంద్ర బ్యాంక్ అభిప్రాయపడింది.

**ఆస్తుల విలువ ఎలా నిర్ణయిస్తారు?**

ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం, బ్యాంకులు స్వాధీనం చేసుకున్న ఆస్తులను తమ ఖాతాల్లో నమోదు చేసే సమయంలో రెండు విలువల్లో తక్కువ విలువను పరిగణించాలి.

రద్దు చేసిన రుణం పుస్తక విలువ

ఆస్తిని వెంటనే విక్రయిస్తే లభించే అంచనా ధర

ఈ రెండింటిలో ఏది తక్కువగా ఉంటే, అదే విలువతో ఆస్తిని లెక్కల్లో నమోదు చేయాలి.

**బ్యాంకు వినియోగిస్తే ఎలా?**

స్వాధీనం చేసుకున్న ఆస్తిని బ్యాంకు స్వ-యంగా కార్యాలయం లేదా ఇతర అవసరాల కోసం ఉపయోగించాలని నిర్ణయిస్తే, ఆ ఆస్తిని ఆర్థికేతర ఆస్తుల జాబితా నుంచి తొలగించి 'స్థిరాస్తులు ' లేదా సంబంధిత అకౌంటింగ్ శీర్షిక కింద నమోదు చేయాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

**కీలక అంశాలు**

2026 అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయి.

డిఫాల్టర్లు లేదా వారి అనుబంధ వ్యక్తులు స్వాధీనం చేసిన ఆస్తులను తిరిగి కొనుగోలు చేయలేరు.

స్వాధీనం చేసిన ఆస్తులను గరిష్ఠంగా 7 ఏళ్లలోపు విక్రయించాలి.

బహిరంగ వేలానికి ప్రాధాన్యం ఇవ్వాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది.

రుణ క్రమశిక్షణను బలోపేతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశం.

# గ్యాస్ సిలిండర్ ధరలు



ఈ నెల ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,191గా ఉంది. ఇక, గృహ వినియోగ ఎల్‌పిజి ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**జులై 17వ తేదీన గ్యాస్ సిలిండర్ ధరలు..**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50



# స్పేస్ రంగంలో నవ శకం..

భారత అంతరిక్ష రంగ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం లిఖించబడనుంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్పేస్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' వారు రూపొందించిన దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 ప్రయోగానికి సర్వం సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక ప్రయోగాన్ని శనివారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి చేపట్టనున్నారు.

**'విక్రమ్-1' రాకెట్ ప్రత్యేకతలు ఇవే..**


ఈ రాకెట్ బాడీని పూర్తిగా కార్బన్ ఫైబర్ నానో-కంపోజిట్ మెటీరియల్‌తో అత్యంత పటిష్టంగా, తక్కువ బరువుతో డిజైన్ చేశారు. రాకెట్‌లోని అత్యాధునిక ద్రవ ఇంధన ఆధారిత ఇంజన్లను అత్యాధునిక 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో స్కైరూట్ స్వయంగా అభివృద్ధి చేసింది. ఈ రాకెట్ ద్వారా దేశీయ, అంతర్జాతీయ క్లయింట్లకు చెందిన పలు చిన్న ఉపగ్రహాలను లో-ఎర్త్ ఆర్బిట్ కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. అంతరిక్ష ప్రయోగాల్లో ఖర్చును తగ్గించడంతో పాటు, ఉపగ్రహాలను వేగంగా కక్ష్యలోకి చేర్చేందుకు వీలుగా విక్రమ్-1 రాకెట్‌ను రూపొందించినట్లుగా స్కైరూట్ ఏరోస్పేస్ సహ-వ్యవస్థాపకుడు పవన్ కుమార్ చందన తెలిపారు. ఈ ప్రయోగం సక్సెస్ అయితే.. అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష విపణిలో భారత్ స్థానం మరింత బలోపేతం కానుంది.






# ఒకరినొకరు తొక్కేయడమే తెలుసు..

తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య ఉన్న తేడాల గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. టాలీవుడ్ పద్ధతులు చాలా బాగుంటాయని చెప్తూ మన తెలుగు ఇండస్ట్రీపై ప్రశంసలు కురిపించింది. బాలీవుడ్ పరిశ్రమతో పోలిస్తే తెలుగు సినీ పరిశ్రమ ఎంతో సహాయకారిగా, ఐక్యంగా ఉంటుందని రకుల్ చెప్పింది.బాలీవుడ్‌లో నటీనటుల మధ్య అభద్రతాభావం , అసూయ ఎక్కువగా ఉంటాయని.. అందుకే అక్కడ ఒకరి సినిమాలకు మరొకరు మద్దతు ఇవ్వరని ఆమె అభిప్రాయపడింది. అంతేకాకుండా, ఒకరి సినిమాలపై మరొకరు నెగిటివ్ ప్రచారం కూడా చేసుకుంటారని ఒకరినొకరు తొక్కేయడమే అక్కడివాళ్లకి తెలుసని రకుల్ సంచలన వ్యాఖ్యలు చేసింది. కానీ, మన తెలుగు ఇండస్ట్రీలో మాత్రం వాతావరణం చాలా భిన్నంగా ఉంటుందని చెప్పిందిటాలీవుడ్‌లో ప్రతి ఒక్కరూ వేరే హీరోల ట్రైలర్లను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రమోట్ చేస్తారని, ఒకరి విజయాలను మరొకరు మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తారని రకుల్ గుర్తుచేసింది. ఇక్కడ అందరూ కలిసికట్టుగా ఉంటారని ప్రశంసించింది. ఒకవేళ బాలీవుడ్ కూడా తెలుగు ఇండస్ట్రీ లాంటి ఐక్యతను, మంచి గుణాన్ని అలవర్చుకుంటే.. మన దేశంలోనే మన సినిమా పరిశ్రమ అత్యంత బలమైనదిగా మారుతుందని రకుల్ ప్రీత్ సింగ్ చెప్పుకొచ్చింది.




# 'జైలర్ 2'పై భారీ అంచనాలు..

సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జైలర్ 2' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాను అక్టోబర్ 16న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. విడుదలకు ఎక్కువ సమయం లేకపోయినా ఈ చిత్రానికి సంబంధించిన తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ బిజినెస్ మాత్రం ఇంకా పూర్తికాలేదని సమాచారం. దీనికి ప్రధాన కారణం 'జైలర్' తొలి భాగం తెలుగు రాష్ట్రాల్లో అంచనాలకు మించి విజయం సాధించడమే.ఆ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్న డిస్ట్రిబ్యూటర్లకు భారీ లాభాలు రావడంతో, 'జైలర్ 2'పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులకు భారీ ధరను కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పలువురు డిస్ట్రిబ్యూటర్లు వెనకడుగు వేస్తున్నారని సమాచారం. అందుకే సినిమాపై మంచి క్రేజ్ ఉన్నప్పటికీ ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల బిజినెస్ పూర్తికాలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను చివరకు ఏ సంస్థ లేదా డిస్ట్రిబ్యూటర్ దక్కించుకుంటారన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# రాయలసీమ బీట్ల సమయం వచ్చింది..




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే వచ్చిన ప్రతి అప్డేట్ అందరిని ఆకట్టుకోగా.. ఫస్ట్ సింగిల్ 'కంసామ్నీడా' కు సోషల్ మీడియాలో స్పెషల్ క్రేజ్ వచ్చింది. ఇప్పుడు ఇదే జోష్‌తో తాజాగా సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు "కంసామ్నీదా.. కిమ్చికారం' కొరియన్ మాట్లాడటం పూర్తయింది.. ఇప్పుడు రాయలసీమ బీట్ల సమయం వచ్చింది.. కొరియన్ కనకరాజు నుంచి సెకండ్ సింగిల్ 'రాసగుమ్మడి' జులై 19న విడుదల కాబోతుంది' అంటూ ఓ సరికొత్త పోస్టర్‌ను షేర్ చేశారు మేకర్స్. కాగా.. ఆగస్టు 7, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్‌లోకి రాబోతున్న ఈ మూవీ ఇండో కొరియన్ బ్యాక్ డ్రాప్‌లో హారర్, కామెడీ కలయికతో రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి



# కౌంటర్ తెలిస్తే షాక్ అవ్వాల్సిందే

కోలీవుడ్ స్టార్ హీరో తలపతి విజయ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'జన నాయగన్'. ఈ సినిమా తొలుత ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల కావాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి, తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విడుదల కానున్న తొలి సినిమా కావడంతో దీనిపై అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో 'జన నాయగన్' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయాలని నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.ప్రస్తుతం వినిపిస్తున్న కథనాల ప్రకారం ఈ చిత్రాన్ని సుమారు 30 దేశాల్లో, 7,000 నుంచి 8,000 స్క్రీన్‌లలో విడుదల చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇది విజయ్ కెరీర్‌లోనే కాకుండా తమిళ సినీ పరిశ్రమ చరిత్రలోనూ అత్యంత భారీ విడుదలల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ అంచనాల నడుమ విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమిత బైజు కీలక పాత్రలో కనిపించనున్నారు. హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించారు.

# ఆ సినిమా ఇక లేనట్లే..



అక్కినేని నాగార్జున కెరీర్‌లో అద్భుతమైన విజయాన్ని అందుకున్న చిత్రాల్లో 'సోగ్గాడే చిన్నినాయన' ఒకటి. ఈ చిత్రానికి కళ్యాణ్ కృష్ణ దర్శకత్వం వహించారు. అనంతరం ఈ సినిమాకు సీక్వెల్‌గా 'బంగార్రాజు' తెరకెక్కింది. ఇందులో నాగార్జునతో పాటు నాగచైతన్య కూడా కీలక పాత్రలో నటించాడు. ఈ చిత్రానికీ కళ్యాణ్ కృష్ణనే దర్శకత్వం వహించారు. 'సోగ్గాడే చిన్నినాయన' స్థాయి విజయాన్ని అందుకోకపోయినా, 'బంగార్రాజు' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని నమోదు చేసింది.కొంతకాలం క్రితం 'సోగ్గాడే చిన్నినాయన' ఫ్రాంచైజీలో భాగంగా నాగార్జున, నాగచైతన్య, అఖిల్ ముగ్గురు హీరోలతో కళ్యాణ్ కృష్ణ మరో చిత్రాన్ని తెరకెక్కించనున్నారని, దానిని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారని జోరుగా ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, కళ్యాణ్ కృష్ణ ఇప్పటికే ఆ చిత్ర కథను అక్కినేని హీరోలకు వినిపించగా, అది వారికి పూర్తిగా నచ్చలేదని తెలుస్తోంది. దీంతో ఆ ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం నాగార్జున 'కింగ్ 100' చిత్రంలో హీరోగా నటిస్తుండగా, నాగచైతన్య 'వృషకర్మ' సినిమాలో నటిస్తున్నాడు. మరోవైపు అఖిల్ తాజాగా 'లెనిన్' సినిమాతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు.



# గుండె ధైర్యం ఉన్నవాళ్లే చూడండి...

సక్సెస్‌ఫుల్ హారర్ ఫ్రాంచైజీగా పేరు తెచ్చుకున్న 'డిమాంటీ కాలనీ' సిరీస్ బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇక దీనికి సీక్వెల్ తెనకెక్కించగా.. బాక్సాఫీసు వద్ద మంచి విజయం సాధించింది. దీంతో ఇప్పుడు ఈ సిరీస్‌లో మూడో భాగంతో ప్రేక్షకులను మరోసారి వణికించేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'డిమాంటీ కాలనీ–3' . 'కోబ్రా', 'డిమాంటీ కాలనీ' మొదటి భాగాలకు దర్శకత్వం వహించిన అజయ్ జ్ఞానముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈసారి సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ సరికొత్త కోణంలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ సినిమాలో రమేష్ తిలక్, సనంత్, అభిషేక్ జోసెఫ్ జార్జ్, హెలెన్ టేలర్, సింగంపులి, ఎంఎస్ భాస్కర్, ప్రముఖ కామెడీ నటుడు యోగిబాబు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఇంతకుముందు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తైనట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా మూవీ మేకర్స్ ప్రేక్షకులకు ఒక క్రేజీ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు "ఏ" సర్టిఫికెట్ జారీ చేసింది. అంటే సినిమాలో భయపెట్టే సీన్స్ చాలా గట్టిగానే ఉన్నట్లు అర్థమవుతోంది. దీంతో పాటు, ముందుగా అనుకున్న తేదీ కంటే ఒకరోజు ముందుగానే, అంటే సెప్టెంబర్ 10నే ఈ సినిమాను థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. "చీకటి తిరిగి వచ్చింది.. ఇది గుండె ధైర్యం లేనివారికి కాదు.. సెప్టెంబర్ 10న చీకటి మళ్లీ వస్తోంది, సిద్ధంగా ఉండండి" అనే క్యాప్షన్ జత చేస్తూ ఓ వీడియోను కూడా పెట్టారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**